డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
TG - AP HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR







| తెలంగాణ Telangana | శుక్రవారం Friday | 29 - 05 -2026 29- 05 -2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 134 Issue: 134 | పేజీలు : 12 Pages: 12 | వెల : 02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|

## రైతు గోసకు బీజేపీ భరోసా

- కడెం, ఖానాపూర్‌లో ఈటెల పర్యటన.
- రైతులతో మాట్లాడిన బీజేపీ నేతలు.
- ధాన్యం కొనుగోళ్లపై ఆరా.



**జనం వాయిస్, నిర్మల్, మే 28:**

రైతు గోస బీజేపీ భరోసా యాత్రలో భాగంగా మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ ప్రాంతాల్లో రైతులతో సమావేశమయ్యారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వారికి భరోసా కల్పించారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని పరిశీలిస్తూ కొనుగోళ్ల పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర, తడిసిన ధాన్యం సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ

- మిగతా 2 లో...

## ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజాపాలన

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



- హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ.
- సంక్షేమం, అభివృద్ధిపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు.
- తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తామన్న సీఎం.

**జనం వాయిస్, హైదరాబాద్, మే 28:**

ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, తెలుగుజాతి గర్వించదగిన నాయకుడు నందమూరి తారక రామారావు స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అమీర్‌పేట్ మైత్రివనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రను చదవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఇందిరా గాంధీ, ఎన్టీఆర్‌లను స్మరించుకోవాలని అన్నారు. ఈ దేశం ఉన్నంతకాలం వారి కీర్తి ప్రతిష్టలు నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రజా సేవలో వారి పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ఎన్టీఆర్ నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడని ముఖ్యమంత్రి అభివర్ణించారు. కులాలు, మతాలు, భాషలకు అతీతంగా ప్రజల మనసుల్లో నిలిచిన నాయకుడని అన్నారు. తెలంగాణ నుంచి అనేక మంది నాయకులకు ఎన్టీఆర్ రాజకీయ భిక్ష పెట్టారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకే ఈ విగ్రహాన్ని

- మిగతా 2 లో...

## గంగా నదిలో పడవ బోల్తా

బిహార్‌లో ఘోర ప్రమాదం.
ఏడుగురు గల్లంతు.
సహాయక చర్యలు కొనసాగింపు.

02



## బీజేపీలో భారీ మార్పులు

నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల నియామకం.
పార్టీ పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం.
పంజాబ్ ఎన్నికలపై బీజేపీ ప్రత్యేక దృష్టి.

02





## ఆర్టీసీ విలీనంపై దీక్ష

అపాయింటెడ్ డే ప్రకటించాలని డిమాండ్.
జూన్ ఒకటిన ఇందిరాపార్క్ వద్ద నిరసన.
ఉద్యోగుల్లో అయోమయం అంటున్న యూనియన్ నేతలు.

2 లో

## పల్లెల్లో జోరుగా ఉపాధి హామీ పనులు

- కూలీల హాజరులో భారీ పెరుగుదల.
- నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత.
- ఎనిమిది కోట్ల పని దినాల లక్ష్యంపై దృష్టి.
- మంత్రి సీతక్క



**జనం వాయిస్, హైదరాబాద్, మే 28:**

తెలంగాణ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి సీతక్క వరుస సమీక్షలతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి పనుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ప్రతిరోజూ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. మే నెల ప్రారంభంలో మండుతున్న ఎండలు, సాంకేతిక సమస్యలు, మొబైల్ ఫోటో నమోదు ఇబ్బందులతో కూలీలు పనులకు రావడంలో ఆసక్తి చూపలేదు. ఆ సమయంలో రోజుకు లక్ష మంది కూలీలు కూడా

- మిగతా 2 లో...

## సమృద్ధిగా ఇంధన నిల్వలు

పశ్చిమాసియా పరిస్థితులపై సమీక్ష.
ఆందోళనతో కొనుగోళ్లు చేయొద్దన్న రాజ్‌నాథ్.
దేశంలో ఎరువుల నిల్వలు కూడా సురక్షితం.



02

## ఈఆర్సీ ముందు బీఆర్ఎస్ వాదనలు

రేపు ప్రజాభిప్రాయ సేకరణ.
కేటీఆర్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం.
రైతు డిస్కంపై ప్రభుత్వాన్ని నిలదీత.

02



## టీజీవో నేత కారుకు ప్రమాదం



02

కారుపై కూలిన చెట్టు.
మంటలతో కాలిపోయిన చెట్టు విరిగిపాటు.
తృటిలో తప్పిన ప్రాణాపాయం.

## సమగ్ర సంక్షేమ కార్డు దిశగా తెలంగాణ

ప్రతి పథకం వివరాలు ఒకే కార్డులో.
ప్రత్యేక డేటా సేకరణకు ఆదేశాలు.
ఏఐ ఆధారిత విశ్లేషణపై దృష్టి.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

02



# ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజాపాలన

- మొదటిపేజీ తరువాయి...
ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ముప్పై వేల ఎకరాల్లో ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ దిగ్గజ సంస్థలను తెలంగాణకు తీసుకురావడంతో పాటు యువతను ఆ సంస్థల యజమానులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో మూడు కోట్ల ఇరవై నాలుగు లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్టీఆర్ అమలు చేసిన



రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం తమకు స్ఫూర్తి అని అన్నారు. కూడు, గుడ్డ, నీడ అనే భావనతోనే ప్రస్తుతం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జనతా వస్త్రాల పథకం స్ఫూర్తితో ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఆశీర్వాదం, ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రజాపాలనలో ప్రతిఫలిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. మహిళలకు రిజర్వేషన్ల అంశంలో రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్ సేవలను గుర్తుచేసుకున్నారు. మహిళలకు ముప్పై మూడు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌లో మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంగా నదిలో పడవ బోల్తా

**జనం వాయిస్, పాట్నా, మే 28:**
బిహార్ రాష్ట్రంలో ఘోర పడవ ప్రమాదం చోటుచేసుకుంది. పాట్నా జిల్లా బార్హ్ ఉపవిభాగ పరిధిలోని ఉమానాథ్ ఘాట్ వద్ద గంగా నదిలో ప్రయాణికులతో వెళ్తున్న పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. స్థానిక అధికారుల వివరాల ప్రకారం గురువారం గంగా నదిలో పద్నాలుగు మంది ప్రయాణికులతో వెళ్తున్న చిన్న పడవ ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం, బలమైన గాలులు, అలల ధాటితో పడవ తిరగబడినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న ప్రజలు సహాయక చర్యలు ప్రారంభించారు. పడవ బోల్తా పడటాన్ని గమనించిన స్థానికులు ఇతర చిన్న పడవల సహాయంతో కొందరు ప్రయాణికులను రక్షించారు. ఈ ఘటనలో ఏడుగురు గల్లంతైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేశారు. నదిలో గల్లంతైన వారికోసం రాష్ట్ర విపత్తు స్పందన దళం బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. గంగా నదిలో విస్తృతంగా శోధన కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గల్లంతైన వారిలో ఇద్దరి మృతదేహాలు లభించినట్లు బార్హ్ ఉప పోలీస్ అధికారి రామకృష్ణ వెల్లడించారు. పడవ ప్రమాద సమయంలో అందులో మొత్తం పద్నాలుగు మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో ఏడుగురిని సురక్షితంగా బయటకు తీసినట్లు తెలిపారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. నదుల్లో ప్రయాణించే సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రమాద బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

# పల్లెల్లో జోరుగా ఉపాధి హామీ పనులు

- మొదటిపేజీ తరువాయి...
పనులకు హాజరుకావడం కష్టంగా మారిందని అధికారులు తెలిపారు. అయితే మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు కనీసం పదహారు లక్షల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మే మొదటి వారంలో ఏడు లక్షల పరిధిలో ఉన్న హాజరు ఇప్పుడు పదహారు లక్షల ఇరవై నాలుగు వేల మందికి చేరిందని అధికారులు తెలిపారు. ఇది ప్రభుత్వ ప్రత్యేక చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. కూలీల హాజరు తక్కువగా ఉన్న జిల్లాలు, మండలాలను గుర్తించి ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. గ్రామాల వారీగా ఇంఛార్జ్‌లను నియమించి ప్రతి కుటుంబానికి పని అందేలా చర్యలు తీసుకుంటున్నారు. వికారాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్గొండ, రాజన్న సిరిసిల్ల జిల్లాలు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఉపాధి పనుల్లో భాగంగా చెరువులు, ఊటకుంటలు, పంటకాలువల్లో పూడికతీత పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. భూగర్భ జలాలను పెంచే పనులను విస్తృతంగా చేపడుతున్నారు. ప్రతి గ్రామంలో కనీసం మూడు నీటి సంరక్షణ పనులు నిర్వహించాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రానికి కేటాయించిన ఎనిమిది కోట్ల పని దినాల లక్ష్యాన్ని పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటివరకు సుమారు నాలుగు కోట్ల యాభై లక్షల పని దినాలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన పని దినాలను కూడా సమయానికి పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా పనిచేస్తోందన్నారు. తెలంగాణ పల్లెల్లో పని ఆగకుండా, పేద కుటుంబాల ఆదాయం తగ్గకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. వర్షాకాలానికి ముందే నీటి సంరక్షణ పనులు పూర్తి చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. చెరువులు నిండితే రైతు బలపడతాడని, భూగర్భ జలాలు పెరిగితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆమె తెలిపారు.

# ఆర్టీసీ విలీనంపై దీక్ష

**జనం వాయిస్, హైదరాబాద్, మే 28:**
ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లుగా అపాయింటెడ్ డే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ ఒకటో తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సామూహిక దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనియన్ నాయకులు వెల్లడించారు. యూనియన్ ఎన్నికలకు ముందుగానే ఉద్యోగుల విలీన ప్రక్రియ పూర్తి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 2026 మే ఒకటో తేదీ నుంచి అపాయింటెడ్ డే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అపాయింటెడ్ డే కంటే ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని అభిప్రాయపడ్డారు. జూన్ ఒకటో తేదీ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. ప్రభుత్వంలో విలీనం కోరుకునే ఉద్యోగులంతా యూనియన్లకు అతీతంగా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షకు తెలంగాణ ఆర్టీసీ కార్మిక సమాఖ్య కూడా మద్దతు ప్రకటించింది. యాజమాన్యం వద్ద పరిష్కారం కావాల్సిన ఇరవై తొమ్మిది సమస్యలపై చర్చలు కొనసాగుతున్న సమయంలో ఎన్నికలకు వెళ్లడం వల్ల కార్మికులు నష్టపోతారని కార్మిక సమాఖ్య నాయకుడు రాజిరెడ్డి పేర్కొన్నారు. ముందుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విలీనం అనంతరం యూనియన్లు కొనసాగితే ఎన్నికల అంశాన్ని పరిశీలించాలని నాయకులు సూచించారు. విలీనానికి సంబంధించిన విధివిధానాలు రూపొందించే కమిటీలో ప్రతి యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు పరిరక్షణ దిశగా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అపాయింటెడ్ డే ప్రకటించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడే వరకు వెనక్కి తగ్గబోమని హెచ్చరించారు. ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అంశంపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# బీజేపీలో భారీ మార్పులు

**జనం వాయిస్, న్యూఢిల్లీ, మే 28:**
భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం పలు రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చేపట్టింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, త్రిపుర రాష్ట్రాలకు కొత్త బీజేపీ అధ్యక్షులను నియమిస్తూ గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ జాతీయ కార్యదర్శి అరుణ్ సింగ్ ప్రకటించారు. తాజా మార్పులతో ఆయా రాష్ట్రాల్లో పార్టీ కార్యాచరణకు కొత్త దిశ లభించనుంది. తాజా నియామకాల ప్రకారం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్న హర్ష్ మల్హోత్రా కు ఢిల్లీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఆ బాధ్యతలు నిర్వహించిన వీరేంద్ర సచ్‌దేవా స్థానంలో ఆయన నియమితులయ్యారు. అలాగే హర్యానా బీజేపీ కొత్త అధ్యక్షురాలిగా డాక్టర్ అర్చనా గుప్తా ను నియమించారు. పంజాబ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా సర్దార్ కేవల్ సింగ్ ధిల్లాన్ కు పార్టీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. త్రిపుర బీజేపీ సారథిగా డాక్టర్ అభిషేక్ దేబ్రాయ్ నియమితులయ్యారు. ఈ నియామకాలు ప్రాంతీయ రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టినవిగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. నితిన్ నబిన్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి భారీ పునర్వ్యవస్థీకరణ ఇదే కావడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. వచ్చే ఏడాది అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, కాంగ్రెస్ అంతర్గత నాయకత్వ సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకుని రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అందుకే అక్కడ కొత్త నాయకత్వానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా నియమితులైన రాష్ట్ర అధ్యక్షులు త్వరలోనే పార్టీ కేంద్ర నాయకత్వంతో సమావేశం కానున్నారు. వారి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కార్యవర్గాల పునర్వ్యవస్థీకరణతో పాటు కొత్త బృందాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. రాబోయే ఎన్నికలు, రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని బీజేపీ సంస్థాగత బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఈఆర్సీ ముందు బీఆర్ఎస్ వాదనలు

**జనం వాయిస్, హైదరాబాద్, మే 28:**
ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ముందు రేపు జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణకు బీఆర్ఎస్ పార్టీ హాజరుకానుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఈ సమావేశంలో పాల్గొని తమ వాదనలను వినిపించనున్నట్లు పార్టీ ప్రకటించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు డిస్కం చర్యలపై ప్రజల ముందుకు వాస్తవాలు తీసుకెళ్తామని బీఆర్ఎస్ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రైతాంగానికి, విద్యుత్ రంగానికి నష్టం కలుగుతుందని బీఆర్ఎస్ ఆరోపించింది. రైతు డిస్కం పేరుతో అమలు చేస్తున్న విధానాల వెనుక ఉన్న కుట్రలను ప్రజలకు వివరించేందుకు సిద్ధమయ్యామని పార్టీ నాయకత్వం వెల్లడించింది. తెలంగాణ రైతుల తరఫున తమ గళాన్ని బలంగా వినిపిస్తామని స్పష్టం చేసింది. రేపు ఉదయం పది గంటలకు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ముందు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో బీఆర్ఎస్ ప్రతినిధి బృందం పాల్గొననుంది. ఈ బృందంలో మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సహా పలువురు సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు పార్టీ తెలిపింది. రైతు డిస్కం ప్రతిపాదనల వల్ల వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని బీఆర్ఎస్ అభిప్రాయపడుతోంది. విద్యుత్ రంగంలో ఆర్థిక భారం పెరిగే ప్రమాదం ఉందని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. రైతులకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం




వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై పూర్తి వివరాలతో కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పార్టీ వెల్లడించింది. రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం అన్ని వేదికలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రజల తరఫున బీఆర్ఎస్ తన బాధ్యతను నిర్వర్తిస్తోందని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని బీఆర్ఎస్ నాయకత్వం వెల్లడించింది. ప్రజలపై అదనపు భారం మోపే విధానాలను వ్యతిరేకిస్తామని తెలిపింది. రేపటి ప్రజాభిప్రాయ సేకరణలో తమ అభిప్రాయాలను బలంగా వినిపించి రైతుల సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొంది.

# సమృద్ధిగా ఇంధన నిల్వలు



**జనం వాయిస్, న్యూఢిల్లీ, మే 28:**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశంలో నిత్యావసర వస్తువుల లభ్యత, సరఫరా వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం సమీక్ష నిర్వహించింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని అనధికార మంత్రుల బృందం సమావేశమై పరిస్థితులను పరిశీలించింది. దేశంలో సరఫరా పరిస్థితి పూర్తిగా సాధారణంగానే ఉందని, ప్రజలు ఆందోళనతో ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ సరఫరా సమృద్ధిగా ఉందని సమావేశంలో అధికార యంత్రాంగం వివరించింది. ఇంధన నిల్వల విషయంలో ఎలాంటి కొరత లేదని స్పష్టం చేసింది. శుద్ధి సామర్థ్యంలో భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద దేశంగా కొనసాగుతోందని తెలిపింది. దేశీయ అవసరాలకు మించి శుద్ధి సామర్థ్యం ఉండటంతో సరఫరాపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొన్నారు. దేశంలోని ఎరువుల నిల్వ పరిస్థితి కూడా సౌకర్యవంతంగా ఉందని మంత్రుల బృందానికి అధికారులు వివరించారు. ఖరీఫ్ పంటల కాలానికి అవసరమైన ఎరువుల పరిమాణాన్ని వ్యవసాయ శాఖ ముందుగానే అంచనా వేసిందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు సాధారణ స్థాయికంటే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం దేశీయ మార్కెట్లపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని కోరారు. నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచనలు జారీ చేసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా నిల్వలు, రవాణా, పంపిణీ వ్యవస్థలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. దేశ ప్రజలకు అవసరమైన ఇంధనం, ఎరువులు, ఇతర కీలక వస్తువుల విషయంలో ఎలాంటి కొరత ఉండదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సరఫరా వ్యవస్థ పటిష్టంగా కొనసాగుతోందని తెలిపింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

# టీజీవో నేత కారుకు ప్రమాదం

**జనం వాయిస్, ఖమ్మం, మే 28:**
టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు ప్రయాణిస్తున్న కారుకు ఖమ్మం జిల్లా వైరా మండలంలో ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఉన్న చెట్టు ఒక్కసారిగా కూలి కారుపై పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో కారులో కుటుంబ సభ్యులు కూడా ఉన్నట్లు సమాచారం. స్థానికుల వివరాల ప్రకారం పొలాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టడంతో మంటలు వ్యాపించి రోడ్డు పక్కనున్న చెట్టు కాలిపోయిందని తెలిపారు. చెట్టు లోపల భాగం బలహీనపడటంతో అది అకస్మాత్తుగా విరిగి కారుపై పడినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనతో స్థానికంగా ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఉన్న కుటుంబ సభ్యులు తీవ్ర భయానికి గురైనట్లు సమాచారం. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కారుకు మాత్రం కొంత నష్టం జరిగినట్లు తెలిసింది. ఘటన సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహకరించారు. అనంతరం రోడ్డుపై పడిన చెట్టు తొలగించే పనులు చేపట్టినట్లు సమాచారం. పొలాల్లో పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అగ్ని వ్యాపించి చెట్లు, విద్యుత్ స్తంభాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం అందరినీ ఊరటకు గురిచేసింది. రోడ్ల పక్కన కాలిపోయిన చెట్లు ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో




అధికారులు పరిశీలనలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సమగ్ర సంక్షేమ కార్డు దిశగా తెలంగాణ

**జనం వాయిస్, హైదరాబాద్, మే 28:**
రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డును రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత మేర లబ్ధి అందుతోందో స్పష్టంగా కనిపించే విధంగా ఈ కార్డు ఉండాలని సూచించారు. దీనికోసం వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సమాచార సాంకేతిక శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ వివరాలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమాచారాన్ని కృత్రిమ మేధస్సు సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత ఖచ్చితంగా చేరేలా వ్యవస్థ రూపొందించాలని



సూచించారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు జారీ చేసే విధానానికి బదులుగా సమాచార సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఒకే సమగ్ర కార్డు ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యాశాఖ, బీమా పథకాల వివరాలు ఈ కార్డులో ఉండాలని సూచించారు. అవసరమైతే రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని చెప్పారు. ఇటీవల నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డుతో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను కూడా సేకరించాలని సమాచార సాంకేతిక శాఖకు సూచించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ద్వారా ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందించవచ్చని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మరణ ధృవీకరణ పత్రం జారీ అయిన వెంటనే ఆ సమాచారం సంబంధిత సంక్షేమ పథకాల డేటాబేస్‌కు చేరేలా వ్యవస్థ ఉండాలని చెప్పారు. ప్రజల ఆరోగ్య వివరాలను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో అనుసంధానం చేయాలని సూచించారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే కార్మికుల విషయంలో కేరళ అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, పాస్‌పోర్టులు, వీసాలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచితే అనధికార ఏజెంట్ల ప్రభావం తగ్గుతుందని పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా ఈ సమగ్ర సంక్షేమ కార్డు ఉపయోగపడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# రైతు గోసకు బీజేపీ భరోసా

- మొదటిపేజీ తరువాయి...
అండగా ఉంటుందని పేర్కొన్నారు. యాత్రలో బీజేపీ శాసనసభ పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు పవార్ రామారావు పాటిల్, పైడి రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, అంజిరెడ్డి, ఏవీఎన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీ నర్సయ్య కూడా రైతులతో మాట్లాడారు.



రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికే ఈ యాత్ర చేపట్టినట్లు ఈటెల రాజేందర్ తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలని కోరారు. రైతులు కూడా తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. కొనుగోళ్లలో జాప్యం, రవాణా సమస్యలు, గోదాముల కొరత వంటి అంశాలను ప్రస్తావించారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాత్రలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాల్లో బీజేపీ నాయకులకు రైతులు వినతిపత్రాలు అందజేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# శాంతి కోసం ప్రాణత్యాగాలు

**యుద్ధాల మధ్య మానవతా సేవలు.**
**ప్రపంచాన్ని కాపాడే శాంతి దళాలు.**
**త్యాగాలను స్మరించుకునే ప్రత్యేక రోజు.**



**జనం వాయిస్, డెస్క్, 28 మే:**

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, ఉగ్రవాద దాడులు, రాజకీయ అస్థిరతలు పెరుగుతున్న సమయంలో అమాయక ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ జీవితాలను పణంగా పెట్టి పనిచేస్తున్న శాంతి సైనికులను స్మరించుకునే రోజే ప్రపంచ అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవం. ప్రతి సంవత్సరం మే 29న ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తూ ఐక్యరాజ్యసమితి ప్రపంచ శాంతి కోసం సేవలందిస్తున్న సిబ్బందికి నివాళులు అర్పిస్తోంది. యుద్ధ ప్రాంతాల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తూ మరణించిన వేలాది మంది శాంతి సైనికుల త్యాగాలను గుర్తుచేసే సందర్భంగా ఈ రోజు నిలుస్తోంది. ప్రపంచంలో శాంతి నిలవాలంటే మానవత్వం, సహనం, పరస్పర గౌరవం ఎంత అవసరమో ఈ దినోత్సవం గుర్తు చేస్తోంది. ఐక్యరాజ్యసమితి శాంతి దళాలు ప్రపంచంలోని పలు దేశాల్లో సేవలందిస్తున్నాయి. యుద్ధాలు, జాతి ఘర్షణలు, రాజకీయ అశాంతి చెలరేగిన ప్రాంతాల్లో సాధారణ ప్రజల భద్రత కోసం ఈ దళాలు పనిచేస్తుంటాయి. కాల్పులు, బాంబు పేలుళ్లు జరుగుతున్న ప్రమాదకర ప్రాంతాల్లో కూడా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, శరణార్థులకు సహాయం అందించడం, ఆహారం, మందులు పంపిణీ చేయడం వంటి కీలక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. అనేక సందర్భాల్లో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులను రక్షించేందుకు శాంతి దళాలు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగుతుంటాయి.

ప్రపంచ శాంతి పరిరక్షణ మిషన్లలో పాల్గొనే సైనికులు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారు. కుటుంబాలకు దూరంగా నెలల తరబడి ప్రమాదకర ప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. తీవ్ర చలులు, అడవులు, ఎడారులు, యుద్ధ వాతావరణం వంటి పరిస్థితుల్లో పనిచేస్తూ మానసికంగా, శారీరకంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ మానవత్వాన్ని కాపాడాలనే లక్ష్యంతో తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. శాంతి కోసం పనిచేస్తున్న ఈ సైనికుల ధైర్యసాహసాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ దినోత్సవం కేవలం సైనికులను స్మరించుకునే రోజు మాత్రమే కాదు. యుద్ధాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న బాధలను ప్రపంచానికి తెలియజేసే సందర్భం కూడా. యుద్ధాల్లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నపిల్లలు, ఆకలితో అలమటిస్తున్న శరణార్థుల పరిస్థితులు ప్రపంచాన్ని కలచివేస్తున్నాయి. అలాంటి ప్రాంతాల్లో సహాయం అందించేందుకు శాంతి దళాలు చేస్తున్న సేవలు మానవత్వానికి నిజమైన నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రపంచ దేశాలు యుద్ధాల కంటే శాంతికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ రోజు గుర్తు చేస్తోంది.

ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో మొదటి శాంతి పరిరక్షణ మిషన్ ప్రారంభమైనప్పటి నుంచి లక్షలాది మంది సైనికులు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సేవలందించారు. ఆఫ్రికా, ఆసియా, మధ్యప్రాచ్య దేశాల్లో జరిగిన అనేక శాంతి మిషన్లలో వీరి పాత్ర ఎంతో కీలకంగా నిలిచింది. కాల్పుల విరమణ ఒప్పందాలను అమలు చేయడం, ఎన్నికల సమయంలో భద్రత కల్పించడం, మానవ హక్కుల పరిరక్షణ కోసం పనిచేయడం వంటి బాధ్యతలను ఈ దళాలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచ శాంతి కోసం దేశాలు కలిసి పనిచేయగలవని ఈ మిషన్లు నిరూపిస్తున్నాయి. భారతదేశం కూడా ఐక్యరాజ్యసమితి శాంతి దళాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. భారత సైనికులు ప్రపంచంలోని అనేక దేశాల్లో సేవలందిస్తూ తమ క్రమశిక్షణ, సేవా భావంతో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. వైద్య సేవలు, మహిళల భద్రత, పిల్లల సంరక్షణ వంటి రంగాల్లో భారత దళాలు చేసిన సేవలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి. ప్రమాదకర పరిస్థితుల్లో కూడా భారత సైనికులు ధైర్యంగా విధులు నిర్వహిస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారు. ప్రపంచ శాంతి కోసం భారత జవాన్లు చేసిన త్యాగాలు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయి.

ప్రపంచంలో యుద్ధాలు పెరిగే కొద్దీ శాంతి దళాల అవసరం కూడా పెరుగుతోంది. దేశాల మధ్య చిన్న చిన్న వివాదాలు కూడా పెద్ద యుద్ధాలకు దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అణ్వాయుధాలు, ఉగ్రవాదం, రాజకీయ అస్థిరత వంటి అంశాలు ప్రపంచానికి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో దేశాలు చర్చలు, రాజీ మార్గాలను అనుసరించి సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. హింస వల్ల నాశనం మాత్రమే జరుగుతుందని, శాంతి ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రపంచ దేశాలు గుర్తించాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవం యువతకు కూడా గొప్ప సందేశాన్ని అందిస్తోంది. సమాజం కోసం సేవ చేయడం, మానవత్వాన్ని కాపాడడం, ఇతరుల కోసం త్యాగం చేయడం ఎంత గొప్ప విషయమో ఈ రోజు తెలియజేస్తోంది. స్వార్థం కంటే సేవా భావం ముఖ్యమని గుర్తు చేస్తూ ప్రపంచంలో శాంతి నెలకొనాలంటే ప్రతి వ్యక్తి బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రేమ, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలు పెరిగితేనే ప్రపంచం మరింత ప్రశాంతంగా మారుతుందని వారు చెబుతున్నారు.

# ఎవరెస్ట్‌పై తొలి విజయం



**ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన సాహసం.**
**ఎడ్మండ్ హిల్లరీ టెన్సింగ్ నోర్గే చరిత్ర.**
**యువతకు ప్రేరణగా ఎవరెస్ట్ గాథ.**

జనం వాయిస్, డెస్క్, 28 మే:

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వత శిఖరం ఎవరెస్ట్‌ను తొలిసారి అధిరోహించిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకునే రోజే ఎవరెస్ట్ విజయం స్మారక దినం. ప్రతి సంవత్సరం మే 29న ఈ రోజును ప్రత్యేకంగా గుర్తిస్తూ ప్రపంచవ్యాప్తంగా సాహస క్రీడల అభిమానులు, పర్వతారోహకులు ఆ మహత్తర ఘట్టాన్ని స్మరించుకుంటారు. 1953 మే 29న న్యూజిలాండ్‌కు చెందిన ఎడ్మండ్ హిల్లరీ, నేపాల్‌కు చెందిన టెన్సింగ్ నోర్గే ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఎవరెస్ట్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి చరిత్ర సృష్టించారు. అసాధ్యంగా భావించిన శిఖరాన్ని జయించి ప్రపంచానికి ధైర్యం, పట్టుదల అంటే ఏమిటో చూపించారు. హిమాలయ పర్వత శ్రేణుల్లో ఉన్న ఎవరెస్ట్ శిఖరం సముద్ర మట్టానికి దాదాపు 29 వేల అడుగుల ఎత్తులో ఉంటుంది. తీవ్ర చలి, తక్కువ ఆక్సిజన్, మంచు తుఫాన్లు, ప్రమాదకర మార్గాలు వంటి ఎన్నో సవాళ్ల మధ్య ఈ శిఖరాన్ని అధిరోహించడం అత్యంత కష్టమైన పనిగా భావిస్తారు. ఆ కాలంలో ఆధునిక సాంకేతిక పరికరాలు, ప్రత్యేక సదుపాయాలు లేకపోయినా ఎడ్మండ్ హిల్లరీ, టెన్సింగ్ నోర్గే అసాధారణ ధైర్యంతో ఈ ప్రయాణాన్ని పూర్తి చేశారు. వారి విజయం ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది.

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు అప్పటివరకు అనేక బృందాలు ప్రయత్నించినప్పటికీ చాలా మంది విఫలమయ్యారు. కొందరు ప్రమాదాల్లో ప్రాణాలు కూడా కోల్పోయారు. అయినప్పటికీ ఎవరెస్ట్‌ను జయించాలనే కలను ఎడ్మండ్ హిల్లరీ, టెన్సింగ్ నోర్గే వదిలిపెట్టలేదు. కఠినమైన శిక్షణ, అనుభవం, ఆత్మవిశ్వాసంతో చివరకు విజయాన్ని సాధించారు. ప్రపంచ చరిత్రలో ఇది అత్యంత గొప్ప సాహస విజయాల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఎవరెస్ట్ విజయంతో ప్రపంచవ్యాప్తంగా పర్వతారోహణ క్రీడలకు మరింత ప్రాధాన్యం పెరిగింది. అనేక దేశాల యువత ఈ సాహస గాథతో ప్రేరణ పొందారు. పర్వతారోహణను వృత్తిగా ఎంచుకునే వారి సంఖ్య కూడా పెరిగింది. ప్రకృతిని దగ్గరగా అనుభవించడం, సాహస జీవితాన్ని ఆస్వాదించడం, శారీరక సామర్థ్యాన్ని పరీక్షించుకోవడం వంటి అంశాలు యువతను ఈ రంగం వైపు ఆకర్షిస్తున్నాయి. ఎవరెస్ట్ విజయ గాథ ఇప్పటికీ లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తోంది.

టెన్సింగ్ నోర్గే నేపాల్ ప్రజలకు గర్వకారణంగా మారగా, ఎడ్మండ్ హిల్లరీ ప్రపంచవ్యాప్తంగా గొప్ప సాహసవీరుడిగా గుర్తింపు పొందారు. శిఖరాన్ని అధిరోహించిన తర్వాత కూడా వారు సాధారణ జీవితం గడుపుతూ పర్వత ప్రాంత ప్రజల అభివృద్ధికి కృషి చేశారు. ముఖ్యంగా హిమాలయ ప్రాంతాల్లో పాఠశాలలు, వైద్య సేవలు ఏర్పాటు చేయడంలో ఎడ్మండ్ హిల్లరీ కీలక పాత్ర పోషించారు. సాహసం మాత్రమే కాదు, సేవా భావం కూడా ఎంత ముఖ్యమో వారు నిరూపించారు. ప్రస్తుతం ఎవరెస్ట్ అధిరోహణకు వేలాది మంది ప్రయత్నిస్తున్నప్పటికీ అది ఇప్పటికీ అత్యంత ప్రమాదకర సాహస యాత్రగానే కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం అనేక మంది పర్వతారోహకులు శిఖరాన్ని చేరేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ వాతావరణ మార్పులు, మంచు విరిగిపడటం, ఆక్సిజన్ కొరత వంటి సమస్యలు ఇప్పటికీ ప్రాణాంతకంగానే ఉంటున్నాయి. అందుకే సరైన శిక్షణ, అనుభవం లేకుండా ఎవరెస్ట్ యాత్ర చేయడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎవరెస్ట్ విజయం స్మారక దినం కేవలం ఒక సాహస విజయాన్ని గుర్తుచేసుకునే రోజు మాత్రమే కాదు. జీవితంలో ఎంతటి కష్టాలు వచ్చినా పట్టుదల, ధైర్యం ఉంటే అసాధ్యాన్ని కూడా సాధించవచ్చని తెలియజేసే రోజు కూడా. లక్ష్యంపై నమ్మకం, కష్టపడే తత్వం, ఓర్పు ఉంటే విజయాన్ని అందుకోవచ్చని ఈ గాథ ప్రపంచానికి చెబుతోంది. అందుకే ఈ రోజు యువతకు ప్రత్యేక ప్రేరణగా నిలుస్తోంది. ప్రపంచంలోని అత్యంత ఎత్తైన శిఖరాన్ని జయించిన ఎడ్మండ్ హిల్లరీ, టెన్సింగ్ నోర్గే పేర్లు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. వారి విజయం మానవ సంకల్పానికి ప్రతీకగా మారింది. ప్రకృతి సవాళ్లను ఎదుర్కొంటూ అసాధ్యాన్ని సాధించిన వారి కథ ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ఆకట్టుకుంటోంది. ఎవరెస్ట్ విజయం స్మారక దినం వారి ధైర్యసాహసాలను గుర్తుచేస్తూ కొత్త తరాలకు స్ఫూర్తినిస్తోంది.

# ఎండల మంటల్లో దేశం

**జనం వాయిస్, డెస్క్, 28 మే:**

దేశవ్యాప్తంగా ప్రకృతి రెండు భిన్న రూపాలు చూపిస్తోంది. ఒకవైపు మండుతున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే.. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలు ఉపశమనం కలిగిస్తున్నాయి. ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుకుని ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. రోడ్లపై మధ్యాహ్న సమయంలో జనసంచారం తగ్గిపోగా.. వేడి గాలులతో వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కేరళ, తమిళనాడు, ఈశాన్య రాష్ట్రాల్లో పడుతున్న వర్షాలు ప్రజల్లో కొత్త ఆశలను నింపుతున్నాయి. దేశంలో ఒకే సమయంలో ఎండలు, వర్షాలు పోటీపడుతున్న ఈ పరిస్థితి వాతావరణ మార్పుల తీవ్రతను మరోసారి బయటపెడుతోంది. ఈసారి వేసవి తీవ్రత గత కొన్నేళ్లతో పోలిస్తే మరింత ఎక్కువగా కనిపిస్తోంది. ఉదయం నుంచే మండుతున్న ఎండలు రాత్రివేళల్లో కూడా తగ్గడం లేదు. పలు నగరాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్క్ దాటడంతో ప్రజలు ఇళ్లలోనే ఉండే పరిస్థితి ఏర్పడింది. ఎండల ప్రభావంతో నీటి కొరత సమస్య కూడా తీవ్రమవుతోంది. గ్రామాల్లో బోర్లు ఎండిపోతుండగా.. నగరాల్లో తాగునీటి కోసం ప్రజలు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో కోతలు కూడా ప్రారంభమయ్యాయి. వేడి తీవ్రత కారణంగా ఆస్పత్రుల్లో హీట్ స్ట్రోక్ కేసులు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. రోజువారీ కూలీలు, బయట పని చేసే కార్మికులు, ట్రాఫిక్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో వర్షాల కోసం దేశ ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. రైతులు అయితే ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. పంటల సాగు ప్రారంభించాలంటే మంచి వర్షాలు తప్పనిసరి కావడంతో మాన్సూన్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో కురుస్తున్న ప్రీ మాన్సూన్ వర్షాలు రైతుల్లో ఆశలు పెంచుతున్నాయి. పొలాల్లో మళ్లీ పనులు



మొదలవుతుండగా.. ఎండిపోయిన చెరువుల్లోకి నీరు చేరడం గ్రామాల్లో ఆనందాన్ని తీసుకొస్తోంది. అయితే వర్షాలు ఆలస్యమైతే వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ ప్రజల జీవితం ఇప్పటికీ ప్రకృతిపైనే ఆధారపడి ఉందనే నిజాన్ని ఈ పరిస్థితులు మరోసారి గుర్తుచేస్తున్నాయి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నైరుతి రుతుపవనాలు క్రమంగా ముందుకు కదులుతున్నాయి. కేరళ తీరాన్ని తాకిన మాన్సూన్ త్వరలోనే మరిన్ని రాష్ట్రాలకు విస్తరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో గాలివానలు ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నాయి. అయితే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు. మరోవైపు వర్షాలు మొదలైతే వరదలు, వైరల్ వ్యాధులు, నీటిమునిగే ప్రాంతాల సమస్యలు కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావం భారత్‌పైనా స్పష్టంగా కనిపిస్తోంది. ఒకచోట తీవ్ర ఎండలు ఉంటే మరోచోట భారీ వర్షాలు, వరదలు కనిపిస్తున్నాయి. అడవుల నరికివేత, కాలుష్యం, పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలు ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భవిష్యత్తులో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, కాలుష్య నియంత్రణ వంటి చర్యలు ఇప్పుడు అత్యవసరంగా మారాయి. ఎండల మంటల మధ్య వాన చినుకుల కోసం ఎదురుచూస్తున్న దేశం ఇప్పుడు మాన్సూన్‌పైనే ఆశలు పెట్టుకుంది.

# సంపాదకీయం

## కడుపు కాపాడితేనే ఆరోగ్యం

**మారుతున్న ఆహారం.. పెరుగుతున్న జీర్ణ సమస్యలు.**
**ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి తెస్తున్న ప్రమాదాలు.**
**ఆరోగ్యకర జీవనశైలిపైనే భవిష్యత్తు.**

**జనం వాయిస్, డెస్క్, 28 మే:**

మనిషి ఆరోగ్యానికి అసలు కేంద్రం గుండె కాదు, మెదడు కాదు.. కడుపే. శరీరానికి అవసరమైన శక్తి, పోషకాలు, రోగనిరోధక శక్తి అన్నీ జీర్ణవ్యవస్థ పనితీరుపైనే ఆధారపడి ఉంటాయి. అలాంటి జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కానీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మారుతున్న జీవనశైలి చూస్తే పరిస్థితి ఆందోళనకరంగా కనిపిస్తోంది. ఒకప్పుడు పెద్దవారిలో మాత్రమే కనిపించిన అజీర్ణం, ఫ్యాటీ లివర్, గ్యాస్, అల్సర్లు వంటి సమస్యలు ఇప్పుడు చిన్న పిల్లల్లో కూడా కనిపించడం భయంకర వాస్తవంగా మారింది. రుచుల కోసం పరుగు తీస్తున్న సమాజం ఆరోగ్యాన్ని మాత్రం నెమ్మదిగా కోల్పోతోంది. ఇప్పటి జీవితం మొత్తం వేగంపైనే నడుస్తోంది. సమయం లేకుండా పని, ఒత్తిడి, బయట తిండి, రాత్రివేళల వరకు మేల్కొని ఉండటం సాధారణంగా మారిపోయాయి. ఇంటి వంటల కంటే ఫాస్ట్ ఫుడ్, నూనె పదార్థాలు, శీతల పానీయాలు, ప్రాసెస్డ్ ఆహారాలు ఎక్కువగా తీసుకుంటున్నారు. ఫలితంగా జీర్ణవ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోంది. తినే సమయాలు లేకుండా, ఆకలి లేకపోయినా తినడం, ఆకలిగా ఉన్నా ఆహారం మానేయడం వంటి అలవాట్లు శరీరాన్ని లోపల నుంచి బలహీనపరుస్తున్నాయి. ముఖ్యంగా యువతలో గ్యాస్, మలబద్ధకం, అజీర్ణం, లివర్ సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే పిల్లల్లో కూడా జీర్ణ సంబంధిత సమస్యలు పెరుగుతుండటం. మొబైల్ ఫోన్లు, టీవీలు చూస్తూ గంటల తరబడి కూర్చోవడం, బయట జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, శారీరక వ్యాయామం తగ్గిపోవడం పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. చిన్న వయసులోనే ఊబకాయం, ఫ్యాటీ లివర్, జీర్ణ సమస్యలు కనిపించడం భవిష్యత్తుకు ప్రమాద సంకేతంగా మారుతోంది. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం కడుపు నిండితే సరిపోదు.. శరీరానికి ఉపయోగపడే ఆహారం తినడం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చింది. జీర్ణవ్యవస్థ బాగాలేకపోతే దాని ప్రభావం మొత్తం శరీరంపైనే పడుతుంది. అలసట, చిరాకు, నిద్రలేమి, బలహీనత, మానసిక ఒత్తిడి వంటి అనేక సమస్యలకు ఇది కారణమవుతోంది. ప్రస్తుతం చాలామంది ఆరోగ్య సమస్యలను చిన్నచూపు చూస్తున్నారు. కడుపులో మంట, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలను సాధారణంగా తీసుకుంటూ నిర్లక్ష్యం చేస్తున్నారు. కానీ అవే తర్వాత పెద్ద వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాత ఆస్పత్రుల చుట్టూ తిరగడం కంటే ముందుగానే జీవనశైలిని మార్చుకోవడం మంచిదని సూచిస్తున్నారు.



మన పాత ఆహారపు అలవాట్లు ఇప్పుడు మళ్లీ అవసరంగా మారుతున్నాయి. ఒకప్పుడు ఇంట్లో తయారయ్యే సాంప్రదాయ ఆహారం శరీరానికి అవసరమైన పోషకాలను అందించేది. కానీ ఇప్పుడు ఆహారం మొత్తం రుచులకే పరిమితమైపోయింది. చిరుధాన్యాలు, పచ్చి కూరగాయలు, పండ్లు, పెరుగు వంటి సహజ ఆహారాలను మానేసి బయట తిండిపై ఆధారపడటం ప్రమాదకరంగా మారుతోంది. ఆహారం విషయంలో నియంత్రణ లేకపోతే భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కేవలం మందులపైనే ఆధారపడటం సరిపోదు. సరైన ఆహారం, తగిన నిద్ర, ప్రతిరోజూ వ్యాయామం, ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి అంశాలు కూడా చాలా అవసరం. ఎక్కువగా నీరు తాగడం, సమయానికి భోజనం చేయడం, రాత్రివేళల్లో ఎక్కువగా తినకపోవడం వంటి చిన్న చిన్న మార్పులు కూడా పెద్ద ప్రయోజనాలను ఇస్తాయి. ముఖ్యంగా రోజుకు కొంత సమయం నడక, వ్యాయామానికి కేటాయిస్తే జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంటే ఖరీదైన మందులు కాదు.. మంచి అలవాట్లేనని వైద్యులు చెబుతున్నారు.

ప్రస్తుతం సమాజం మొత్తం ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాలు, ప్రకటనలు చూపిస్తున్న ఆకర్షణీయ ఆహారాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను గుర్తించాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నేర్పించాలి. పాఠశాలలు, కుటుంబాలు, ప్రభుత్వాలు కలిసి ప్రజల్లో జీర్ణ ఆరోగ్యంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా కడుపు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే భావన ప్రతి ఒక్కరిలో రావాలి. ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం కేవలం ఒక దినోత్సవంగా మిగలకూడదు. మన జీవనశైలిని ఒకసారి పరిశీలించుకునే అవకాశంగా తీసుకోవాలి. రుచుల కోసం ఆరోగ్యాన్ని త్యాగం చేసే పరిస్థితి నుంచి బయటపడాలి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేది మందులు కాదు.. సరైన ఆహారం, క్రమశిక్షణ, మంచి జీవనశైలి అనే విషయాన్ని సమాజం గుర్తించాల్సిన సమయం వచ్చింది. కడుపు బాగుంటేనే మనిషి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలడనే నిజాన్ని ఈ దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది. సామాజిక మాధ్యమాలు, ప్రకటనలు చూపిస్తున్న ఆకర్షణీయ ఆహారాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను గుర్తించాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నేర్పించాలి. పాఠశాలలు, కుటుంబాలు, ప్రభుత్వాలు కలిసి ప్రజల్లో జీర్ణ ఆరోగ్యంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా కడుపు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే భావన ప్రతి ఒక్కరిలో రావాలి. ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం కేవలం ఒక దినోత్సవంగా మిగలకూడదు. మన జీవనశైలిని ఒకసారి పరిశీలించుకునే అవకాశంగా తీసుకోవాలి. రుచుల కోసం ఆరోగ్యాన్ని త్యాగం చేసే పరిస్థితి నుంచి బయటపడాలి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేది మందులు కాదు.. సరైన ఆహారం, క్రమశిక్షణ, మంచి జీవనశైలి అనే విషయాన్ని సమాజం గుర్తించాల్సిన సమయం వచ్చింది. కడుపు బాగుంటేనే మనిషి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలడనే నిజాన్ని ఈ దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది.

# ముస్లిం డ్రైవర్లకు సరుకుల పంపిణీ

- బక్రీద్ సందర్భంగా సేవా కార్యక్రమం.
- విద్య కోసం ఆర్థిక సహాయం అందజేత.





**జనం వాయిస్, గోదావరిఖని, మే 28:**

బక్రీద్ పండుగ సందర్భంగా గోదావరిఖని పట్టణంలోని చౌరస్తా అడ్డా2 ఆటో కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో ముస్లిం ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నలభై మంది ఆటో డ్రైవర్లకు సరుకులు అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ సీనియర్ నాయకుడు జాహెద్ పాషా తెలిపారు. పండుగ సమయంలో ప్రతి కుటుంబానికి చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ముస్లిం ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఉపయోగపడే విధంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అడ్డా2 అధ్యక్షుడు అన్ను భాయ్ కుమారుడి ఉన్నత విద్య కోసం వీహెచ్ఆర్ ఫౌండేషన్ తరపున పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. విద్యాభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు జాహెద్ పాషా మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధే కేసీఆర్ లక్ష్యమని అన్నారు. ఏ పండుగ వచ్చినా సంబంధిత సామాజిక వర్గాలకు చేయూత అందించడమే వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పండుగ సమయంలో ప్రతి కుటుంబంలో ఆనందం నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాళ్ల హరీష్ రెడ్డి ప్రజలకు అండగా నిలుస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని నాయకులు కొనియాడారు. ప్రజల జీవితాల్లో సంతోషం తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులు అందించినందుకు ఆటో కార్మిక సేవా సమితి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సేవా సమితి అధ్యక్షుడు కడార్ల శ్రీధర్, పొలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణ, నారమళ్ళ రమేష్, జక్కుల ప్రేమ్ కుమార్, కొండ సురేష్, నూతి రాజ్ కుమార్, అస్లాం, అంకూస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

# హైకోర్టు తీర్పు అమలు చేయాలని

## మున్సిపల్ కమిషనర్ కు వినతి

**అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు.. ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కరెంట్ పోల్స్‌పై ఆందోళన.**

**జనం వాయిస్, మంథని, మే 28:**



మంథని పట్టణానికి చెందిన వొల్లాల నవ్య చేపట్టిన అక్రమ నిర్మాణాలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ మేడగోని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఒల్లాల నవ్య నిర్మించిన భవనానికి సంబంధించిన అక్రమ నిర్మాణాలపై 2022లో తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ నెం. 41697/2022 దాఖలైందని తెలిపారు. ఈ కేసులో 16-11-2022న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం హైకోర్టు ఆదేశాల అమలుపై రిట్ పిటిషన్ నెం. 7254/2025లో కూడా 06-08-2025న మరోసారి ఉత్తర్వులు వెలువడినప్పటికీ, వాటిని గౌరవించకుండా అక్రమ నిర్మాణాలను తిరిగి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా భవనంలో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపట్టారని, రెండో అంతస్తుకు సంబంధించిన అక్రమ నిర్మాణాలపై ఇప్పటివరకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అధికారులు తాత్కాలికంగా కొంత భాగాన్ని తొలగించినప్పటికీ, తిరిగి మరమ్మతులు చేసి షాపులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించిన మేడగోని శ్రీనివాస్, వెంటనే కోర్టు తీర్పు మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మళ్లీ హైకోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా, భవనం ముందు భాగంలో హైవే రోడ్డుకు ఆనుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కరెంట్ పోల్స్ ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్థంభాలను వెంటనే తొలగించి వేరే ప్రాంతానికి మార్చాలని సంబంధిత అధికారులను కోరారు.

# ధాన్యంతో రైతు నిరసన

**తోపుడు బండిపై ధాన్యం తరలింపు. లారీల కొరతపై ఆగ్రహం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు.**




**జనం వాయిస్, యాదాద్రి భువనగిరి, మే 28:**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ రైతు వినూత్న నిరసన చేపట్టాడు. పంట సాగు ప్రారంభమైనప్పటి నుంచి ధాన్యం విక్రయించే దశ వరకు రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్ల రైతుల సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని విమర్శించాడు. లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన కందాడి మహిపాల్ రెడ్డి అనే రైతు తోపుడు బండిపై ధాన్యాన్ని తరలిస్తూ నిరసన వ్యక్తం చేశాడు. కాలికి చెప్పులు లేకుండా గ్రామం నుంచి ఆలేరు మార్కెట్ యార్డు వరకు ధాన్యం తీసుకెళ్లి ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశాడు. నిరసన సందర్భంగా రైతు పలువురు దృష్టిని ఆకర్షించేలా నినాదాలతో కూడిన పలకలు ప్రదర్శించాడు. "రైతు గుండె రగులుతోంది.. రేవంత్ సీటు కదులుతోంది", "రైతు కన్నీటి శాపం.. ప్రభుత్వానికి వినాశనం" వంటి నినాదాలతో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం రైతులను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోందని పేర్కొన్నాడు. అలాగే "కుర్చీ దిగుతావా.. కొనుగోలు చేస్తావా.. తేల్చుకో రేవంత్ రెడ్డి", "రైతు పాలిట యముడు" వంటి నినాదాలతో తోపుడు బండిపై ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తరలించాడు. ఈ వినూత్న నిరసన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రైతు చేపట్టిన నిరసనకు పలువురు రైతులు మద్దతు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం, రవాణా సమస్యలు, లారీల కొరత వంటి కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లినా సరైన సమయంలో కొనుగోలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో రైతులపై అదనపు భారం పడుతోందని పేర్కొంటున్నాయి. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రవాణా సౌకర్యాలు పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. రైతు చేసిన ఈ నిరసన ప్రభుత్వం స్పందించేలా చేయాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- మంథని డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కాంపల్లి దాస్.

**జనం వాయిస్, మంథని, మే 28 :**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 కింద షెడ్యూల్డ్ కాస్ట్ ఆర్డర్ 1950 క్లాస్ 3లోని మతపరమైన నిబంధనలు పూర్తిగా చట్టవిరుద్ధమైనవని, వీటిని వెంటనే తొలగించి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని మంథని డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కాంపల్లి దాస్ డిమాండ్ చేశారు. గురువారం మంథని పట్టణంలోని సీయోను చర్చిలో దళిత క్రైస్తవులు హక్కుల సాధన కోసం మంథని మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం మారినంత మాత్రాన ఎస్సీ హోదాను రద్దు చేయడం న్యాయసూత్రాలకు పూర్తిగా విరుద్ధమన్నారు. మతం మారినంత మాత్రాన వారిని ఎస్సీ జాబితా నుంచి తొలగించడం ప్రాథమిక హక్కులను కాలరాయడమే కాక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఎస్సీలు ఏమతం ఆచరించినా వారికి ఎస్సీ హోదా కోల్పోకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 17, 21, 25 ప్రకారం అందరికీ సమాన హక్కులు లభించేలా షెడ్యూల్డ్ కాస్ట్ ఆర్డర్ 1950లోని మతప రమైన ఆంక్షలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఓసీ, బీసీ, ఎస్టీలకు ఏవిధమైన సమాన హక్కులు ఉన్నాయో ఎస్సీలకు కూడా అవే హక్కులు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మంథని మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కలువల సామెల్, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ సిరిపురం అబ్రహం, కోశాధికారి రెవరెండ్ మంథని మార్క్, పాస్టర్లు దూడ మహేష్ , అజ్మీరా దయరాజు, కన్నూరి కృపావరం, ఎలీషా తో పాటు పాస్టర్లు సంఘ పెద్దలు విశ్వాసులు పాల్గొన్నారు.



# ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ వేడుకలు.



**ఈద్గాలు,మసీదుల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు. ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.**



**జనం వాయిస్, రామగుండం:**

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.త్యాగం, కరుణ,శాంతికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్-ఉల్-అధా) పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఈద్గాలు,మసీదుల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రార్థనల సమయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఈద్గాల వద్ద ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,బక్రీద్ పండుగ త్యాగానికి, ప్రేమకు, మానవత్వానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. ప్రజలంతా పరస్పరం మతాలను గౌరవించుకుంటూ సోదరభావంతో పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.పండుగ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈద్గాలు, మసీదులు,ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.సోషల్ మీడియాలో వచ్చే వదంతులు,అసత్య ప్రచారాలను నమ్మవద్దని సీపీ సూచించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు స్థానిక పోలీసులను లేదా డయల్-100ను సంప్రదించాలని పోలీస్ కమిషనర్ కోరారు.



# ఖమ్మంలో ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

**జనం వాయిస్, ఖమ్మం, 28 మే 28:**

మాజీ ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానాయకుడిగా ఎన్టీఆర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. రాజకీయాల్లో ప్రజా సంక్షేమానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన నాయకుడిగా ఎన్టీఆర్‌ను గుర్తు చేసుకున్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఆయన పనిచేశారని నాయకులు తెలిపారు. సామాన్య ప్రజల పట్ల ఆయన చూపిన ప్రేమ, మమకారం ఎప్పటికీ మరువలేనివని అన్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఎన్టీఆర్ నినాదాలతో ట్యాంక్‌బండ్ ప్రాంతం మారుమోగింది. అభిమానులు పూలమాలలు సమర్పించి మహానేతకు నివాళులు అర్పించారు. తెలుగు జాతి గౌరవాన్ని పెంచిన మహానుభావుడిగా ఎన్టీఆర్ ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోతారని నాయకులు పేర్కొన్నారు. సినీరంగం, రాజకీయ రంగాల్లో ఆయన సృష్టించిన ప్రభావం అపారమని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. జయంతి కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో కొనసాగింది. నాయకులు, అభిమానులు ఎన్టీఆర్ సేవలను గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన మహానేతగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని పేర్కొన్నారు.



RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM


# మంచిర్యాలలో ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు.

## మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

**జనం వాయిస్, మంచిర్యాల, మే 28:**

మంచిర్యాల:-బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంచిర్యాల నియోజకవర్గ ముస్లిం సోదరులకు మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ గార్లు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న ఖదీమ్ ఈద్గాతో పాటు క్వారీ రోడ్ (అండలమ్మ కాలనీ) లోని మసీదులను వారు సందర్శించి, అక్కడ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలకు పండగ శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మంచిర్యాల పట్టణ మాజీ అధ్యక్షులు గాదె సత్యం, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అంకం నరేష్, సీనియర్ నాయకులు గోగుల రవీందర్ రెడ్డి, ఎర్రం తిరుపతి, కార్పొరేటర్ పెట్టం స్వరూప-లక్ష్మణ్, అబ్దుల్ సత్తార్, మాజీ కౌన్సిలర్లు వంగ తిరుపతి, పల్లె రాజన్నలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, టీబీజీకేఎస్ (ఒదీ+ఖూ) నాయకులు మరియు బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం.

**రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి.**
**కనీస మద్దతు ధర చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టాలి.**
**కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మోడీ సర్కార్.**
**ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతు వ్యతిరేక చట్టాల జీవో కాపిలు దగ్ధం.**
**జి. సక్రు ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి.**




**గార్ల /జనం వాయిస్ :**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా ఉండి రైతులకు గిట్టుబాటు ధరపై చట్టపరమైన హామీ కల్పించకపోవడం విచారకరమని ఏఐకేఎంఎస్ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. సక్రు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక చాపల మార్కెట్ సెంటర్లో ఎస్కేయం, ఏఐకేఎంఎస్ పిలుపులో భాగంగా గురువారం మోడీ సర్కార్ తీసుకోవచ్చిన రైతు వ్యతిరేక చట్టాల జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కనీసం మద్దతు ధర చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టి,రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం పంటలకు నామమాత్రపు ధరలు పెంచి చేతులు దులుపుకుందని కేంద్రం పెంచిన ధరలు రైతన్నలను మోసం చేసే విధంగా ఉన్నాయని ఆయన అన్నారు.భారత రైతాంగం చేసిన పోరాటానికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి నేటికీ అమలు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేనియెడల పెద్ద ఎత్తున రైతాంగంతో ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ముళ్ళ రంగారావు,మండల అధ్యక్షులు మాలోత్ మాన్య,సహాయ కార్యదర్శి సూత్రపు మనోహర్, న్యూడెమోక్రసీ మండల నాయకులు ఇర్రి రవి, బి. మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల నిరీక్షణ

## కౌన్సిలింగ్ ముగిసినా దక్కని పోస్టింగ్ ఆర్డర్లు!

**జనం వాయిస్, మంచిర్యాల, మే 28:**



సింగరేణి కాలరీస్ పరిధిలో ప్రమోషన్ కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ, అర్హులైన కార్మికులకు ఇంతవరకు ప్రమోషన్ ఆర్డర్లు, సీనియారిటీ మరియు గనుల కేటాయింపులు చేయకపోవడంపై కార్మిక వర్గాల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. గత మూడు నెలలుగా ఈ ప్రక్రియ నిరంతరం వాయిదా పడుతుండటంతో యాజమాన్య తీరుపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు; ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, కౌన్సిలింగ్ పూర్తి చేసుకున్న కార్మికులను పాత గనులకే పంపించాలని మరియు పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ ఆర్డర్లను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

**వడదెబ్బ, పొగాకు దుష్పరిణామాలపై విస్తృత అవగాహన.**
**మంచిర్యాల పట్టణంలో అధికారుల ప్రత్యేక ప్రచారం.**
**బస్టాండ్, బెల్లంపల్లి చౌరస్తాలో అవగాహన కార్యక్రమాలు.**

**జనం వాయిస్, మంచిర్యాల, మే 28:**

పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పొగాకు వాడకం వల్ల కలిగే ప్రాణాంతక ఆరోగ్య సమస్యలపై మంచిర్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, బెల్లంపల్లి చౌరస్తాలో అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ ప్రమాదం పొంచి ఉన్నందున ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రాకూడదని సూచించారు. ప్రయాణికులు, బయట పనిచేసేవారు ఎల్లప్పుడూ తాగునీటిని, ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, ఒకవేళ తల తిరగడం, వికారం, తీవ్రమైన అలసట, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని స్పష్టం చేశారు. అనంతరం బెల్లంపల్లి చౌరస్తాలో ఒక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో అధికారులు పాల్గొని, వడదెబ్బ నివారణకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. సమాజంలో పొగాకు వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ ప్రజలు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో సాగిన ఈ ప్రత్యేక కార్యక్రమాల్లో ఆర్టీసీ సమన్వయకర్త శ్రీమతి భారతి, జిల్లా మాస్ మీడియా అధికారి డిపి రావు, భీమయ్య, ఎపిడి బుక్క వెంకటేశ్వర్, మాలజిస్ట్ శ్రీ సుమన్ తదితరులు పాల్గొన్నారు.




# మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిపై పెరిగిన రోగుల భారం

**రోజుకు 1,100 మందికి పైగా ఓపీ సేవలు.**
**అందుబాటులో ఉన్నవి కేవలం 250 పడకలే!**
**సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితేనే తప్పని తిప్పలు.**
**మరో ఏడాదిన్నర పట్టే అవకాశం!**

**జనం వాయిస్, మంచిర్యాల, మే 28:**

మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోజురోజుకు రోగుల భారం విపరీతంగా పెరుగుతోంది; ప్రస్తుతం రోజుకు 1,100 మందికి పైగా ఓపీ సేవలు పొందుతుండగా, అందుకు తగ్గట్టుగా కేవలం 250 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ పడకల కొరత కారణంగా కాస్త కోలుకున్న రోగులను డిశ్చార్జ్ చేస్తూ, కొత్తగా వచ్చే వారికి వైద్యులు సర్దుబాటు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి గనుక పూర్తయితే అదనంగా 450 పడకలు, 40 మంది వైద్యులతో పాటు న్యూరాలజీ, కార్డియాలజీ వంటి ప్రత్యేక సేవలు అందుబాటులోకి వస్తాయి కానీ, ఆ పనులు పూర్తి కావడానికి మరో ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రజలకు అప్పటివరకు ఈ తిప్పలు తప్పేలా లేవు.




# నిబంధనలు మీరితే వ్యాపారులపై చర్యలు

## వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ హెచ్చరిక

**జనం వాయిస్, మంచిర్యాల, మే 28:**



మంచిర్యాల విభాగం పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల వ్యాపారులు అందరూ 2026-27 సంవత్సరానికి గాను ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని జన్నారం వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ ఆదేశించారు. వ్యాపారులందరూ తమ అనుమతి పత్రాలను సకాలంలో పునరుద్ధరణ చేసుకోవాలని, దుకాణాలలో గరిష్ట చిల్లర ధరల బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఎరువుల అమ్మకాలు కేవలం ఎలక్ట్రానిక్ అమ్మకపు యంత్రం (ఈ-పోస్) ద్వారానే జరగాలని, అలాగే గ్లైఫోసేట్, నకిలీ విత్తనాల విక్రయాలపై కఠినమైన నిషేధం ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై కఠినమైన చర్యలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

# గార్లలో ఘనంగా బక్రీద్ వేడుకలు.

## త్యాగానికి, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా బక్రీద్ పండుగ.

**గార్ల /జనం వాయిస్ :**

త్యాగానికి, భక్తి విశ్వాసాలకు ప్రతీక అయిన బక్రీద్ పర్వదిన వేడుకలు గార్లలో ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.నిన్నటి వరకు భానుడు భగభగ మండినా బక్రీద్ పండుగ సందర్భంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ముస్లిం సోదరులు సంతోషం వ్యక్తం చేశారు. గార్ల ఈద్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా కొత్త బట్టలు ధరించి పండుగ వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఉదయం వాతావరణం పూర్తిగా చల్లబడింది. దీంతో ఈద్గాలో ప్రార్థనలకు వచ్చిన వృద్ధులు, చిన్నారులు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా నమాజ్‌లో పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు ఈద్గాలో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక సామూహిక నమాజ్ చేశారు. “అల్లాహ్ దయవల్లే ఈరోజు వాతావరణం చల్లగా ఉందని,పండుగను ప్రశాంతంగా జరుపుకున్నామంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.పలువురు హిందూ సోదరులు, రాజకీయ నాయకులు ఈద్గా వద్దకు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.గార్ల ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.



# ఐకేపీ, వీఓఏల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు సంపూర్ణ మద్దతు!

**జనం వాయిస్, మంచిర్యాల, మే 28:**

దండేపల్లి:దండేపల్లి మండల కేంద్రంలో తెలంగాణ ఐకేపీ, వీఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో, ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన సమ్మెకు మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు గారు మరియు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ గారు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని సందర్శించిన వారు, వీఓఏల న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలిపి, వెంటనే ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు గారు మాట్లాడుతూ... వీఓఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారు చేస్తున్న సమ్మెకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు.

**వీఓఏల ప్రధాన డిమాండ్లు ఇవే:**

వీఓఏలకు నెలకు రూ. 20 వేల కనీస వేతనం ఇవ్వాలి.
సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలి.
అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలి.
వీఓఏలకు రూ. 20 లక్షల సాధారణ మరియు ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలి.
విధులకు అవసరమైన ట్యాబ్ మరియు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి.
58వ ప్రభుత్వ ఉత్తర్వును (జీవో 58) వెంటనే సవరించాలి.

ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ, వీఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, సమ్మె నిర్వాహకులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో వీఓఏలు పాల్గొన్నారు.



# ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో వీలినం చేయాలి..!

**టిఎంయూ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎంపీ రెడ్డి.**
**ఉమ్మడి కరీంనగర్ జిల్లా టిఎంయూ నూతన ం కమిటీ ఎన్నిక.**
**జిల్లా కార్యదర్శిగా అధ్యక్షులుగా ఏవిఆర్ రెడ్డి, జిపి సింగ్.**

**జనం. వాయిస్.హుస్నాబాద్ మే 28:**



ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు వెంటనే విలినం ప్రక్రియ డేట్ ను జూన్ 2న ప్రకటించాలని టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి ఎంపీ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఆర్టీసీ కార్మికులలో గందరగోళాన్ని సృష్టించేలా ఉన్నాయని ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు తర్వాత నిర్వహించాలని ముందు విలీన ప్రక్రియ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఆర్టీసీ కార్మికుల ప్రధానమైన డిమాండ్ విలీనం దీనిని పరిగణలో తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆయన అన్నారు.ఈ మేరకు టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి టిఎంయు రాష్ట్రజాయింట్ సెక్రటరిగా మరియు కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జిగా ఎంపీ రెడ్డిని నియమిస్తూ అధికారిక ఉత్తరలు జారీ చేశారు.అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజియన్ కార్యదర్శిగా ఏవిఆర్ రెడ్డిని మరియు అధ్యక్షులుగా జీ పి సింగ్ మరియు రాష్ట్ర సి వి పి గా కె.ఎస్.రెడ్డి ని నియమించినట్లు ఆయన తెలిపారు.టీఎంయూ కార్మికుల పక్షాన రాజీలేని పోరాటం చేస్తూ పనిచేస్తామని వారు అన్నారు.

# ఆఖరి గింజ వరకు వరి ధాన్యం కొనుగోలు చేస్తాం

- మంత్రి గడ్డం వివేకానంద.
- చెన్నూర్, కోటపల్లి ప్రాంతాల్లో జూన్ 15 వరకు కొనుగోళ్లు.
- బావురావుపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి, కలెక్టర్ కుమార్ దీపక్.





**జనం వాయిస్, మంచిర్యాల మే 28:**
రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు వరి ధాన్యమును కొనుగోలు చేస్తామని రాష్ట్ర శాఖ మంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రమును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డి మరియు ఇతర అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈసారి దిగుబడులు పెరిగినందున జిల్లా వ్యాప్తంగా దాదాపు ఒక లక్షా అరవై వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే అవకాశం ఉందన్నారు. పంట కోతలు ఆలస్యమైనందున చెన్నూర్, కోటపల్లి ప్రాంతాలలో జూన్ పదిహేనవ తేదీ వరకు కొనుగోళ్లు జరుపుతామని, నాణ్యమైన ధాన్యానికి సంబంధించిన నిధులను నేరుగా రైతుల ఖాతాలలోనే జమ చేస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం సేకరణలో కూలీలు, రవాణా ఇబ్బందులు లేకుండా స్థానిక కూలీలను ఏర్పాటు చేశామని, సింగరేణి సంస్థతో మాట్లాడి ఇసుక రవాణా వాహనాలను ధాన్యం తరలింపునకు మళ్లించామని మంత్రి వివరించారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళనల వైపు రెచ్చగొడుతున్నారని మండిపడుతూ, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఇప్పటికే డెబ్బై శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ప్రక్రియను మరో పదిహేను రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. వచ్చే నెల ఏడవ తేదీ నుండి వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున, అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా పెద్దపల్లి, కరీంనగర్, జైపూర్ లలోని నిల్వ కేంద్రాలకు తరలిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో దాదాపు పది వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అంతకుముందు చెన్నూరు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం పనులను కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించి, వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేకానంద, కలెక్టర్ కుమార్ దీపక్, ప్రతినిధి రఘునాథ్ రెడ్డిలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా ఘనంగా బక్రీద్ వేడుకలు

## శాంతి సామరస్యాలకు ప్రతీకగా బక్రీద్ : ఎస్సై కుశకుమార్

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నగూడూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు గురువారం భక్తిశ్రద్ధలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మసీదులు, ఈద్గాహ్ ప్రాంగణాలకు చేరుకున్న ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజులు నిర్వహించి దేశ ప్రజల శాంతి, సౌభాగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని నూకలోన్ బోర్డు సమీపంలో నిర్వహించిన ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో చిన్నగూడూరు ఎస్సై కుశకుమార్ పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, ప్రేమాభిమానాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలంతా మత సామరస్యంతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ముస్లిం పెద్దలు, యువకులు పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనగా, మసీదులు సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎంపీడీవో మున్వర్ బేగ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు జహంగీర్ పాషా, యాకూబ్ జానీ, ముస్తఫా, యాకూబ్, జలీల్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



# పెట్రోల్ డీజిల్ రేట్ల పెంపుపై ఉన్న శ్రద్ధ ఉద్యోగాల భర్తీపై కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు లేదు.

## డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి.



**జనం వాయిస్, హుస్నాబాద్ మే.28:**
కేంద్ర ప్రభుత్వము రోజువారీగా పెట్రోల్ డీజిల్ నిత్యావసర సరుకుల పై రోజురోజుకు పెంచుతున్న కేంద్ర ప్రభుత్వము గడిచిన 12 సంవత్సరాల కాలంలో ఎన్ని ఉద్యోగాలు భర్త చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి తిరుపతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధి లేక యువత ఆర్థికంగా ఇబ్బందుపడుతున్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం అడ్డు అదుపు లేకుండా నిత్యవసర సరుకులు, పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచుతూ ఆర్థిక వనరులను సమకూరుస్తున్న కేంద్ర ప్రభుత్వము. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎందుకు కల్పించడం లేదని మోడీ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. నిరుద్యోగ భారతాన్ని నిర్మూలిస్తాం అర్హులైన ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని చెప్పి అధికారంలో వచ్చిన మోడీ ప్రభుత్వం నేడు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. నేడు దేశంలో రోజురోజుకు నిరుద్యోగ శాతం పెరిగి యువత గంజాయి డ్రగ్స్ లకు అలవాటు పడి కుటుంబ పోషణ భారమై ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన 12 సంవత్సరాల కాలంలో కనీసము లక్ష ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న లక్షల పై చిలుక ఉద్యోగాలను భర్తీ చేయకుండా నేడు దేశంలో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలను కొమ్ముకాస్తున్నారని ఆయన అన్నారు. దేశంలో నిరుద్యోగ యువతపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న వివిధ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రోజురోజుకు పెంచుతున్న పెట్రోల్ డీజిల్ నిత్యవసర సరుకుల రేట్లను తక్షణమే తగ్గించి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని ఆయన అన్నారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలి

## సిపిఎం మండల పార్టీ కార్యదర్శి దుడ్డేల రాముర్తి

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల పార్టీ కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి డిమాండ్ చేశారు. గురువారం మహబూబాబాద్ మండలంలోని మాదాపురం గ్రామంలో పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఆటోలకు తాళ్లు కట్టి లాగుతూ నిరసన వ్యక్తం చేస్తూ గ్రామ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సిపిఎం మండల పార్టీ కార్యదర్శి దుడ్డేలా రామ్మూర్తి, చేపూరి గణేష్ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచి పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమరు ధరలు తగ్గుతున్న దేశంలో మాత్రం ధరలు పెంచడం వెనక బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమని విమర్శించారు. ఇంధన ధరలు పెరుగుదల ప్రభావం సామాన్యుడి పై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బియ్యం ఉప్పు, పప్పు పప్పు నూనెలు కూరగాయదారులు ఆకాశం అంటుతున్నాయన్నారు. మోడీ సర్కార్ అమెరికాకు తృప్తిగా వ్యవహరిస్తూ దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతుందని అన్నారు. రష్యా ఇరాన్ వంటి దేశాలు తక్కువ ధరకే చమరిస్తున్న అమెరికా భయంతో కొనుగోలు చేయకుండా ప్రజలపై భారం వేస్తుంది అన్నారు. చమరు కంపెనీలకు బడా పారిశ్రామికవేతలకు లాభం చేకూర్చేందుకే బిజెపి ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంటుందని సిపిఎం పార్టీ విమర్శించింది. దేశం కోసం భారం మోయాలని చెప్పడం ప్రజలను మోసం చేయడమేరన్నారు. అప్పుల్లో ఉన్న రైతులు సామాన్యులకు ఆదుకోవాల్సింది పోయి వారిపై పెట్రోల్ భారం వేయడం పుండు మీద కారం చల్లినట్లు ఉందని విమర్శలు చేశారు. ఇప్పటికైనా పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు చేపూరి గణేష్, బొడ్డుపల్లి బ్రహ్మం, ఆరూరి శ్రీను, పశువుల సతీష్, కొలగాని వెంకన్న, నూకల చంద్రశేఖర్, నూకల వీరన్న, పేరం దశరథం, బంటు నరేష్, కోల కళ్యాణ్, దుడ్డెల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




# టీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి బోడ జనార్దన్

**కల్వకుంట్ల కవిత సమక్షంలో చేరిక.**
**రానున్న ఎన్నికల్లో గెలుపు మనదేనని ధీమా.**

**జనం వాయిస్, మంచిర్యాల, మే 28:**
రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి బోడ జనార్దన్ తన అనుచరులతో కలిసి తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు పార్టీ కండువా కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బోడ జనార్దన్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో తెలంగాణలో తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వస్తుందని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత పాలన సాగించిన పార్టీలను, ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో అనుచరులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.




# బాల్క సుమన్ వ్యాఖ్యలపై మండిపడ్డ జంగపల్లి ఐలయ్య..

## విధ్వంసకర రాజకీయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

**జనం వాయిస్ అక్కన్నపేట, మే.28:**
బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇటీవల చేసిన వివాదాస్పద మరియు విధ్వంసకర వ్యాఖ్యలపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ శ్రేణులను, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన చేసిన పిలుపును అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, హుస్నాబాద్ డివిజన్ రైతు ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జంగపల్లి ఐలయ్య మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎక్కడైనా నిరసనలు లేదా ధర్నాలు చేపడితే ప్రజల నుండి, ముఖ్యంగా రైతాంగం నుండి కనీస మద్దతు లభించడం లేదని ఎద్దేవా చేశారు. వీడియో ఆధారాలను ప్రస్తావిస్తూ భీమారం, కిష్టంపేట ప్రాంతాల్లో జరిగిన ధర్నాల్లో కేవలం కొద్దిమంది మాత్రమే పాల్గొన్నారని, మిగతా వారంతా పార్టీ కార్యకర్తలేనని స్వయంగా బాల్క సుమనే అంగీకరించారని గుర్తుచేశారు. ప్రజలు తమను నమ్మడం లేదనే నిరాశ, నిస్పృహలతోనే బీఆర్ఎస్ నేతలు ఇలాంటి దాడుల సంస్కృతికితెరలేపుతున్నారని ఆయన విమర్శించారు. "సోషల్ మీడియా ప్రచారాలు, ప్రెస్ మీట్లతో ఏమీ కాదు.. మిలిటెంట్ యాక్షన్ కావాలి" అంటూ బాల్క సుమన్ కార్యకర్తలను రెచ్చగొట్టడం అత్యంత హేయమైన చర్య అని ఐలయ్య పేర్కొన్నారు. మందమర్రిలో సింగరేణి జీఎం కార్యాలయాన్ని తగలబెట్టాలని, హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను కాల్చేయాలని, రైల్ రోకోల పేరుతో రైల్వే లైన్లను ధ్వంసం చేయాలని పిలుపునివ్వడం బాధ్యతాయుతమైన మాజీ ప్రజాప్రతినిధికి తగదన్నారు. "విధ్వంసాలు చేస్తే పైసలు అవే వస్తాయి, భయపడొద్దు" అంటూ కార్యకర్తల్లో నేరపూరిత ఆలోచనలు నూరిపోస్తున్నారని, ఇది రాజకీయ పోరాటం కాదని, ముమ్మాటికీ ఉగ్రవాద తరహా ఆలోచన అని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రజలు, రైతులు ప్రశాంతంగా ఉన్నారని, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను, ముఖ్యంగా తెలంగాణ సిరుల తల్లి అయిన సింగరేణిని లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్రేరేపిస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. తక్షణమే బాల్క సుమన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు, సింగరేణి కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని జంగపల్లి ఐలయ్య డిమాండ్ చేశారు. శాంతిభద్రతలను భంగం కలిగించేలా మాట్లాడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



# మంచిర్యాలలో బక్రీద్ వేడుకలు: మేయర్, కార్పొరేటర్ల శుభాకాంక్షలు

**జనం వాయిస్, మంచిర్యాల, మే 28:**
మంచిర్యాల పట్టణంలో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో, అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అండాలమ్మ కాలనీ ఈద్గా మరియు బస్ స్టాండ్ కబ్రస్థాన్ దర్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్మి మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు (కార్పొరేటర్) తూముల నరేష్‌లతో పాటు పలువురు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్ ధర్మి మధుకర్ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ శాంతి, సహనానికి ప్రతీక అని, అందరూ కలిసిమెలిసి పండుగను జరుపుకోవాలని కోరారు. తూముల నరేష్ మాట్లాడుతూ.. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లిం సోదరులతో కలిసి పండుగ వాతావరణంలో పాలుపంచుకోవడం పట్టణంలో నెలకొన్న మత సామరస్య వాతావరణాన్ని ప్రతిబింబించింది.



# మిల్లర్ల దోపిడీపై అధికారుల మౌనం ఎందుకు..?

**విజిలెన్స్ విచారణ జరపాలి..!**
**కవ్వ వేణుగోపాల్ రెడ్డి**
**భారతీయ కిసాన్ సాంగ్ హుస్నాబాద్ డివిజన్ ఇంచార్జ్.**

**జనం వాయిస్, హుస్నాబాద్ మే 28:**
క్వింటాలకు ఐదు కిలోల తరుగు, ప్రతి ట్రాక్టర్‌కు ఐదు బస్తాల కటింగ్, ఏ గ్రేడ్ వడ్లను బి గ్రేడ్‌గా చూపిస్తూ రైతులను మోసం చేస్తున్న మిల్లర్లపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకొని సంబంధిత మిల్లులను అధికారులు సీజ్ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ హుస్నాబాద్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు నిజంగా న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే, వెంటనే మిల్లర్లపై విజిలెన్స్ విచారణ జరిపించాలని, అలాగే గ్రామాల వారీగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలలో రైతులకు జరిగిన అన్యాయంపై రెవెన్యూ శాఖ, గ్రామ కార్యదర్శుల ద్వారా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మిల్లర్ల ముందు నష్టపోయిన రైతులతో కలిసి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నాటి నుంచి మిల్లర్ల దోపిడీని అరికట్టాలని, రైతులకు అన్యాయం జరుగుతోందని పలుమార్లు రెవెన్యూ శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ముఖ్యంగా హుస్నాబాద్ ప్రాంతంలో ఏ గ్రేడ్ వడ్లను బి గ్రేడ్‌గా మార్చి రైతులను తీవ్రంగా నష్టపరిచారని అన్నారు. మిల్లర్ల యజమానులు వడ్లను దించుకునే ముందు బస్తాల కటింగ్ పేరుతో అక్రమ వసూళ్లు చేశారని, అలాగే మిల్లుల్లో ఉన్న వే బ్రిడ్జ్‌ల వద్ద ప్రతి ట్రాక్టర్‌కు రూ. 100 చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. జిల్లా అధికారులు ఈ దోపిడీపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. రైతులు పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు మిల్లర్లపై చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ఎంతమంది రైతులకు అన్యాయం జరిగిందో వివరాలు సేకరించి, మిల్లర్లు ఒక్కో రైతు వద్ద నుండి ఎన్ని బస్తాలు తరుగు పేరుతో తీసుకున్నారో నివేదిక తెప్పించుకోని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకునేలా జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# పొలాల్లో ఘోర అగ్నిప్రమాదం

... 50 ఎకరాల్లో కాలిబూడిదైన గడ్డి.., మోటార్లు దగ్ధం.
... కాంపల్లి శివారు రూపుల నాయక్ తండాలో విషాదం.
... లబోదిబోమంటున్న కౌలు రైతులు.
... ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్.







**కురవి / జనం వాయిస్ :**
మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం కాంపల్లి గ్రామ శివారులోని రూపుల నాయక్ తండాలో గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లో నిప్పు పెట్టడంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు 40 నుండి 50 ఎకరాల మేర గడ్డి, పొలాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఏం చేయాలో పాలుపోక రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనతో పశువులకు మేపడానికి గడ్డి లేక రైతులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### రూ. లక్షల్లో నష్టం.. కాలిపోయిన మోటార్లు

ఈ ప్రమాదంలో పొలాల్లోని గడ్డితో పాటు కౌలు రైతుల వ్యవసాయ మోటార్లు కూడా పూర్తిగా కాలిపోయాయి. బాధితుల్లో తేజవత్ పాబు, ఇస్లావత్ వెంకన్న, తేజవత్ రాంచంద్రు, తేజవత్ సీతారాం, బాధవత్ నరేష్, ఇస్లావత్ సూక్కి, బానోత్ మనోహర్, కొమ్ము ఉప్పలయ్య, నర్సిరెడ్డి తదితర రైతులు ఉన్నారు. ఒక్కో మోటార్ విలువ సుమారు రూ.30,000 నుండి రూ. 35,000 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం వల్ల తమకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లిందని కౌలు రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

### తక్షణమే నష్టపరిహారం అందించాలి

ఈ ఘోర ఘటనపై అధికారులు వెంటనే స్పందించాలని బాధితులు కోరుతున్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి తమకు తక్షణమే ప్రభుత్వ నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పొలాలకు నిప్పు పెట్టి ఇంతటి నష్టానికి కారణమైన గుర్తు తెలియని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, తండావాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యను బోధించే టీచర్లు పారదర్శకంగా ఉండాలి

**పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బిఎస్ పి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, హుస్నాబాద్.**

**జనం వాయిస్. హుస్నాబాద్ మే28:**
ప్రభుత్వ పాఠశాలలో నర్సరీ నుండి పదవ తరగతి వరకు చదువుకొనుట కొరకు ప్రభుత్వం నుండి ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్న ప్రైవేటు పాఠశాలలకే విద్యార్థుల తల్లిదండ్రులు ఎందుకు మొగ్గు చూపుతున్నారు ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు యూనిఫామ్స్,టిఫిన్,, మధ్యాహ్నం భోజనం, స్కూల్ గ్రౌండ్, ఉద్యోగ పరీక్షలలో బెన్ఫిట్ మార్క్స్ ఇవన్నీ సదుపాయాలు కల్పించిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎందుకు ఆకర్షితులు కావడం లేదు. కొంతమంది తల్లిదండ్రులను బి ఎస్ పి పార్టీ పక్షాన ప్రైవేట్ స్కూళ్లలో ఎందుకు చేర్పిస్తున్నారు అని అడిగిన సందర్భంలో ప్రభుత్వ టీచర్ల పిల్లలు వారు ప్రభుత్వ స్కూల్లో ఎందుకు చేర్పించడం లేదు అని ప్రశ్నించడం జరిగింది. ప్రభుత్వ స్కూళ్లలో వాతావరణం ఆసాంఘిక కార్యక్రమాలు అనగా సిగిరెట్ తాగడం కావచ్చు,గంజాయి సేవించడం కావచ్చు లైంగిక వేధింపులు ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా? పాఠశాల విద్యను సరైన నాణ్యత బోధించే విషయంలో ఏదైనా లోపము ఉన్నదా? మరి ఎందుకు వాళ్లు వారి పిల్లలను చేర్పించడం లేదని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు అడగడం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు అడిగే ప్రశ్నలలో న్యాయం ఉంది. మరి ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనయ్యే అవకాశం ఏమైనా ఉన్నదా? ఇంత అభద్రతా భావం ఎందుకు ఏర్పడుతుంది. ఇట్టి విషయంలో ప్రభుత్వంలో ఉన్న త శాఖ అధికారులు, మంత్రులు,ఎమ్మెల్యేలు ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా బాధ్యత వహించకపోవడం వల్ల నిరుపేద, పేద కుటుంబాలు కూడా ప్రైవేటు స్కూల్లో వైపే మొగ్గు చూపుతున్నాయి. మా ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలను చేర్పించాల ని తెల్లారి లేచి ప్రభుత్వ ఉపాధ్యాయులు, వాడవాడకు తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. కానీ



వారి యొక్క పిల్లలు చదువుకొనుట విషయంలో మాత్రం 90% ప్రైవేటు స్కూలు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇట్టి విషయంలో అందరూ పూర్తిస్థాయిలో బాధ్యత వహిస్తేనే ప్రభుత్వ స్కూలు మనుగడ సాధిస్తాయి. ప్రభుత్వం కూడా ఇట్టి విషయంలో తీవ్రస్థాయిలో ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా ప్రజా ప్రతినిధులు మరియు ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ స్కూల్లో చదివించే విధంగా మార్గదర్శకంగా ఉండాలని బిఎస్పీ పార్టీ పక్షాన డిమాండ్ చేయడం జరుగుతుంది.

# ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగంగా నిర్వహించాలి

**రైస్ మిల్లులు, గోదాములకు త్వరితగతిన ధాన్యం తరలింపు.**
**జూన్ 7 నుండి వర్షాలు వచ్చే అవకాశం..**
**ఆలోపే కొనుగోళ్లు పూర్తి చేస్తాం:**
**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.**

**జనం వాయిస్, మంచిర్యాల మే 28:**
ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని, ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ ప్రాంతంలో గల మునీందర్ & బ్రోస్ ఫర్టిలైజర్స్ గోదాంను ఆయన అధికారులతో కలిసి సందర్శించి, ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాకు చెందిన ధాన్యం నిల్వ చేసేందుకు ఈ గోదామును కేటాయించడం జరిగిందని తెలిపారు. ధాన్యం దిగుమతి వేగంగా నిర్వహించాలని, లారీల అన్‌లోడింగ్‌కు ఇబ్బంది లేకుండా అవసరమైన మేరకు హమాలి సంఖ్యను పెంపొందించుకోవాలని అధికారులను సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వచ్చే నెల (జూన్) 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున, ఈలోగానే ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మహబూబాబాద్ జిల్లాలో ఘనంగా బక్రీద్ వేడుకలు

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లాలోని పలు మండల కేంద్రాలు, గ్రామాలలో పండుగ వాతావరణం సంతరించుకుంది. తెల్లవారుజాము నుంచే ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి స్థానిక మసీదులు, ఈద్గాహ్ ప్రాంగణాలకు భారీగా చేరుకున్నారు. ఈద్గాహ్‌ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలలో (నమాజ్) చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత గురువులు బక్రీద్ పండుగ విశిష్టతను, త్యాగ నిరతిని భక్తులకు వివరించారు.

### దేశ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు :

నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దేశ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో వర్ధిల్లాలని, దేశంలో శాంతిసౌభాగ్యాలు విలసిల్లాలని అల్లాను ప్రత్యేకంగా ప్రార్థించారు. శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను హిందూ, ముస్లిం సోదరులు కలిసి జరుపుకోవడం విశేషం. పండుగ సందర్భంగా ముస్లిం నివాసాలు బంధుమిత్రులతో కళకళలాడాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు.



# బక్రీద్ పండుగ సందర్భంగా తనిఖీలు



**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
మహబూబాబాద్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డా. శబరీష్ ఆదేశాల మేరకు, బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా మహబూబాబాద్ పట్టణంలో బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. టౌన్ సీఐ ఎల్. రఘుపతి రెడ్డి, జి. ఉమా ఆధ్వర్యంలో గురువారం ఈద్గా, దర్గాలు, పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, నెహ్రూ సెంటర్, తొర్రూరు బస్ స్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు, వస్తువులను బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా పరిశీలించాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో అంజయ్య, అశోక్, మురళి (డాగ్ హ్యాండ్లర్), ఆర్పీఎఫ్ సిబ్బంది ఆర్. సార్య, కె. నాగిరెడ్డి, డాగ్ హ్యాండ్లర్ ఎల్. సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# కేరళంలో మాజీ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ ఇంటిపై ఈడి దాడులను ఖండించండి:సిపిఎం

**మే 28 జనం వాయిస్, పాలకుర్తి:**
కేరళం రాష్ట్రాన్ని అత్యంత పారదర్శకంగా నిజాయితీగా రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పరిపాలించిన కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిపిఎం పొలిటి బ్యూరో సభ్యులు పినరై విజయన్ అద్దెకుంటున్న ఇంటిపై కేంద్ర ప్రభుత్వం ఐటీ సోదాలు చేపించడం అత్యంత హేయమైనా చర్య అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అన్నారు. గురువారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో సిపిఎం పాలకుర్తి మండల కమిటీ అధ్వర్యంలో పినరాయి విజయన్ పై ఈడీ దాడుల నిరసిస్తూ ప్లే కార్డ్స్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ కేరళ మాజీ సీఎం పీనరయ్ విజయన్ నివాసంపై ఈడి జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని,ఇది ఒక అగ్రసేని ప్రతిపక్ష నాయకుడి పై కేంద్ర ప్రభుత్వం జరిపిన కక్షిత మైన దాడి అని,కేంద్ర ప్రభుత్వం రాజకీయ సవాలను ఎదుర్కోలేకే ఇలాంటి కుయుక్తులు పన్నుతుందని,ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రతిపక్షాలపై కేంద్ర ప్రభుత్వం దాడులు తీవ్రతరం చేసిందని,కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకులపై నేరుగా దాడులు జరుగుతూ ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతిపక్షాలను ప్రశ్నించే మీడియాను సహించలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని,నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించే సిపిఎం పై కక్ష ధోరణి మానుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని,పినరాయ్ విజయన్ ఇంటిపై దాడులను ప్రజాసామికవాదులు, వామపక్ష ప్రజాతంత్ర వాదులు, ప్రజలు, మేధావులు,ఖండించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్, బెల్లి సంపత్, వివిధ గ్రామాల నాయకులు బచ్చు శ్రీలత, గడ్డి సమ్మయ్య, నక్క రమేష్, యాదనాల చిరంజీవి, చిట్యాల సంధ్యారాణి, సిఐటియు నాయకులు అంబటి సోమయ్య, దండు కృష్ణ, సమ్మయ్య, పరమేష్, మై బు, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



# బక్కని నర్సింహులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి.

**శీలంశెట్టి రమేష్,,మాజీ ఎంపీటీసీ..**



**గార్ల /జనం వాయిస్ :-**
టిడిపి మహానాడులో ఆ పార్టీ నేత బక్కని నరసింహులు డిక్షనరీలో తెలంగాణ అనే పదమే లేదంటూ తెలంగాణ అస్తిత్వాన్ని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను గార్ల మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, నాలుగు కోట్ల ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవ పోరాటాల ప్రతీక అయిన తెలంగాణను చులకనగా చేసి మాట్లాడటం సరికాదన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అమరుల త్యాగాలను అవమానించిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని యావత్ తెలంగాణ సమాజానికి బక్కని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఏ డిక్షనరీలో వెతికితే తెలంగాణ దొరకదు? వందల ఏళ్ల చరిత్ర, విశిష్టమైన సంస్కృతి, భాష కలిగిన తెలంగాణ పదాన్ని లేదనడం అంటే ఈ గడ్డను, ఇక్కడి ప్రజల పోరాటాలను, అమరవీరుల త్యాగాలను ముమ్మాటికీ అవమానించడమే అన్నారు.తెలంగాణ అస్తిత్వాన్ని ప్రశ్నించే హక్కు మీకెవరు ఇచ్చారు? రాజకీయ ప్రయోజనాల కోసం, ఉనికిని చాటుకోవడం కోసం తెలంగాణ అస్తిత్వాన్ని తృణీకరించడం ఎంతవరకు న్యాయం?తెలంగాణ పదంపై చేసిన అవహేళన వ్యాఖ్యలను బక్కా నరసింహులు వెంటనే వెనక్కి తీసుకోవాలి, లేనిపక్షంలో తెలంగాణ సమాజం తగిన బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు.తెలంగాణ సెంటిమెంట్‌తో, ప్రజల ఆత్మగౌరవంతో ఆటలాడుకుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు, ఇకనైనా ఇటువంటి బాధ్యతారహితమైన వ్యాఖ్యలు మానుకోవాలని హెచ్చరించారు.

# రాఘవరావు కుటుంబాన్ని పరామర్శించిన ఝాన్సీ రెడ్డి

**పాలకుర్తి, మే 28 జనం వాయిస్:**
జనగామ జిల్లా పాలకుర్తి మండలం నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు మామ అల్లమానేని బుచ్చిరావు ఇటీవల మృతి చెందగా, విషయం తెలుకున్న టిఫిసిసి ఉపాధ్యాక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి గురువారం వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా బుచ్చిరావు చిత్రపటానికి ఆమె పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం శోకసప్తప్త కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, బుచ్చిరావు గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ మార్కెట్ చైర్మన్ లావుడియా మంజులా భాస్కర్,ఓబీసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి గణేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పెనుగొండ రమేష్,సీనియర్ నాయకులు పోగు శ్రీనివాస్,పన్నీరు వెంకన్న, పాలకుర్తి వార్డు సభ్యులు కామరాపు సునీల్,సలెంద్ర శ్రీనివాస్,భాస్కర్,స్థానిక మహిళా నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఉల్లంపల్లిలో భక్తిశ్రద్ధలతో ఘనంగా బక్రీద్ వేడుకలు

**ఈద్గా నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కు ముస్లింసోదరుల వినతి.**

**చిగురుమామిడి:జనం వాయిస్:**

మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో బక్రీద్ (ఈద్-ఉల్ ఆదా) పండుగను ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉల్లంపల్లి గ్రామంలోని ఈద్గా స్థలం వద్ద ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరై చిన్న పెద్ద తేడా లేకుండా ప్రత్యేక హీద్ నమాజులు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరికి నొకరు ఆలింగనం చేసుకొని ఈద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చిన్నారులు యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణంలో చేశారు. గ్రామ సర్పంచ్ అలవాల శంకర్ కార్యక్రమానికి హాజరై ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, భక్తి, కరుణ, సహనాలకు, ప్రాతికైన పవిత్ర పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి సమృద్ధిని ఇవ్వాలని, అల్లాహు దయతో ప్రజలంతా బాగుండాలని వారు కోరారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు సయ్యద్ షరీఫ్ మాట్లాడుతూ మండలంలోనే అత్యధికంగా ముస్లిం సోదరులు ఉన్న ఉల్లంపల్లి గ్రామంలో ఈద్గా నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించి నిర్మాణం జరిగేలా చొరవ చూపాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కోరారు. రంజాన్, బక్రీద్ తదితర పండుగల సందర్భంగా పెద్ద ఎత్తున ఉన్న ముస్లిం సోదరులు నమాజ్ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మత్తడి వద్ద ఉన్న స్థలంలో ఈద్గా నిర్మాణానికి అధికారులు మంత్రి సహకరించాలని కోరారు. చిగురుమామిడి మండలంలోని వివిధ గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలవాల శంకర్, వార్డు సభ్యుడు సయ్యద్ షరీఫ్, సయ్యద్ కమాలుద్దీన్, సయ్యద్ ఫఖీరుద్దీన్, షేక్ నన్నే సాబ్, సయ్యద్ గోరేమియా, సయ్యద్ అలీఫ్, సయ్యద్ కమల్ , షేక్ చోటే మియా, పటాన్ సాదుల్లా, ఎస్ కే ఛానల్, ఎస్. కె కాసిం, ఎస్ కే షరీఫ్, పటాన్ సలీం తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి: జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు

**రోజుకు 40 నుండి 50 లారీల దిగుమతే లక్ష్యం.. నెలాఖరులోగా కొనుగోళ్లు పూర్తి కావాలి**



**జనం వాయిస్, మంచిర్యాల మే 28:**

ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి, కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో కలిసి జైపూర్ మండలం రామారావుపేట లోని సుముఖ గోదామును, హాజీపూర్ మండలంలోని గాయత్రి రైస్ మిల్లును సందర్శించి, ధాన్యం అన్‌లోడింగ్ అవుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలును చేపడుతోందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం మిల్లులు, గోదాములకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా ఆలస్యం జరగకుండా రైస్ మిల్లులు, గోదాములకు చేరిన ధాన్యాన్ని వేగవంతంగా దిగుమతి చేయాలని, ఇందుకోసం రోజుకు కనీసం 40 నుంచి 50 లారీల ధాన్యం దిగుమతి అయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీలను ఇప్పటికే సమకూర్చడం జరిగిందని, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ నెలాఖరులోగా జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొత్తం పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 1 వరకు ఇందిరమ్మ ఇండ్లకు ప్రత్యేక సడలింపులు

**- బయట ప్లాస్టరింగ్, వైట్ పెయింట్, మెయిన్ డోర్ పూర్తి చేస్తే ఫైనల్ బిల్లు మంజూరు.**
**- కురవి ఎంపిడిఓ వీరబాబు.**



**కురవి / జనం వాయిస్ :** ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం కీలక ఉపశమనం కల్పించింది. స్లాబ్ స్థాయి వరకు గృహ నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఫైనల్ బిల్లు మంజూరు చేయుటకు తాత్కాలిక సడలింపులు అమలు చేస్తున్నట్లు కురవి ఎంపిడిఓ వీరబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సడలింపుల ప్రకారం ఇంటి నిర్మాణం పూర్తిస్థాయిలో కాకపోయినా, ఇంటి బయట వైపు ప్లాస్టరింగ్ పనులు పూర్తి చేసి, వైట్ వాష్ లేదా వైట్ పెయింట్ వేయించి, మెయిన్ డోర్ అమర్చినట్లయితే ఫైనల్ బిల్లు మంజూరు చేయబడుతుందని పేర్కొన్నారు. అయితే ఈ ప్రత్యేక సడలింపులు 01-06-2026 తేదీ వరకు మాత్రమే అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. 02-06-2026 తేదీ తర్వాత ఫైనల్ బిల్లు పొందాలంటే గృహ నిర్మాణం అన్ని పనులతో సహా పూర్తిస్థాయిలో పూర్తి చేసి ఉండవలసి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, జూన్ 1వ తేదీ లోపు ఇంటి బయట ప్లాస్టరింగ్ పనులు పూర్తి చేసి, వైట్ పెయింట్ వేయించి, మెయిన్ డోర్ అమర్చించి, ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు పనులు పూర్తి చేసుకోవాలని అధికారి సూచించారు. ఈ నెలాఖరు నాటికి పై పనులు పూర్తి చేసి ఫైనల్ బిల్లు మంజూరు పొందుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

# గుండ్ల పోచంపల్లిలో సీఐటీయూ మున్సిపల్ కార్మికుల నూతన కమిటీ ఏర్పాటు

**మేడ్చల్ మే 28 (జనం వాయిస్):**

గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గుండ్ల పోచంపల్లిలోని మల్లన్న గుడి వద్ద జరిగిన సమావేశంలో కార్మికుల హక్కులు, సంక్షేమం, భవిష్యత్ పోరాటాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం. నరేష్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, సెలవుల కొరత వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. హర్యానా, ఢిల్లీ రాష్ట్రాల తరహాలో తెలంగాణలో కూడా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించడంతో పాటు, రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. అదేవిధంగా వారానికి ఒక రోజు సెలవు, పండుగ సెలవులు, ఆదివారం సెలవులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం సీఐటీయూ గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కార్మికుల యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శిగా గణేష్, గౌరవ అధ్యక్షుడిగా ఎం. నరేష్, ట్రెజరర్‌గా రాజ్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా శ్రీను, మంజుల, లక్ష్మణ్, జయమ్మలను ఎన్నుకోగా, సహాయ కార్యదర్శులుగా లక్ష్మి, సత్యవ్జీ, కమల, శ్రీకాంత్, రజిత, స్వామిలను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా శివ, కృష్ణ, వెంకటయ్య, ఉమారాణి, నిర్మల, నర్సింహా, నగేష్, ఏలీయా, నాగమణి, పద్మ, విజయ్‌లను ఎన్నుకున్నారు. వీరబాబును సలహాదారుగా నియమించారు. కార్మికుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని నాయకులు పిలుపునిచ్చారు.



# కేరళ మాజీ సీఎం విజయన్‌పై ఈడీ దాడులు రాజకీయ కక్ష సాధింపు చర్యలు

**సీపీఎం నేతల ఆగ్రహం నిజాయితీని దెబ్బతీయలేరు**

**మేడ్చల్ మే 28 (జనం వాయిస్):-**

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌పై ఈడీ నిర్వహించిన సోదాలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో మేడ్చల్ మండలంలో సీపీఎం నాయకులు సమావేశమై ఈడీ చర్యలను తీవ్రంగా ఖండించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వారు విమర్శించారు. కేసులు లేకుండానే దాడులు ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్ మండల కమిటీ సభ్యుడు డి. నరసింగరావు మాట్లాడుతూ, విజయన్ పై ఎలాంటి స్పష్టమైన కేసులు లేకుండానే ఈడీ సోదాలు నిర్వహించడం రాజకీయ కక్ష సాధింపునకు నిదర్శనమని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీలను లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించారు. ఈడీ సోదాల అనంతరం ఎలాంటి అవినీతి ఆరోపణలు నిరూపించకుండానే అధికారులు వెళ్లిపోవడం సీపీఎం పార్టీ నిజాయితీకి నిదర్శనమని అన్నారు. “ప్రజల కోసం పనిచేసే నాయకులను దర్యాప్తు సంస్థలతో భయపెట్టలేరు” అని వ్యాఖ్యానించారు.

పినరాయి విజయన్ సాధారణ జీవనశైలి ఉదాహరణ

విజయన్‌పై ముఖ్యమంత్రి పదవి ముగిసిన వెంటనే ప్రభుత్వ సౌకర్యాలను వదిలి కిరాయి ఇంట్లో నివసించడం ఆయన సాధారణ జీవనశైలికి నిదర్శనమని సీపీఎం నేతలు పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పటికీ వ్యక్తిగత లాభాల కోసం పనిచేయకుండా ప్రజల కోసం కట్టుబడి పనిచేశారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌లపై విమర్శలు దేశంలో అవినీతి, మహిళలపై నేరాలకు సంబంధించిన ఆరోపణలు బీజేపీ నాయకులపైనే ఎక్కువగా ఉన్నాయని, తరువాత కాంగ్రెస్‌లో కూడా అలాంటి ఘటనలు ఉన్నాయని సీపీఎం నాయకులు విమర్శించారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజా సమస్యలపై పోరాడే నాయకులపై ఈడీ దాడులు చేయడం సరైన విధానం కాదన్నారు. సీపీఎం పోరాటం ఆగదు ఈడీ దాడులతో సీపీఎం పార్టీ వెనక్కి తగ్గదని, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. కేంద్ర సంస్థలను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదగిరి, దేవమ్మ, సంపూర్ణ, సత్యమణి, బాలమణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.

**కందునూరి శ్రీనివాస్, సీఐటీయు జిల్లా అధ్యక్షులు.**

**గార్ల/జనం వాయిస్:**

కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీలకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయు ఆధ్వర్యంలో ఈనెల 30న జనగామలో నిర్వహించనున్న అ సంఘం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని గురువారం ఆల్ హమాలీ కార్మికులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హమాలీలకు పీఎఫ్, ఈఎస్ ఐ, ప్రమాద బీమా, పింఛన్ తదితర సౌకర్యాలతో హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ సంస్థల్లో ఎగుమతి, దిగుమతి పనులు చేస్తున్న హమాలీలను 4వ త రగతి ఉద్యోగులుగా గుర్తించాలని, 50 సంవత్సరాలు నిండిన హమాలీలకు కనీస పెన్షన్ రూ.6000 నిర్ణయించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం నాయకులు అంబటి వీరాస్వామి, మల్లయ్య, ప్రవీణ్, సర్వర్, కోటయ్య, రమేష్, సాయి, నవీన్, విజయ్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# మంత్రి పొన్నం ఆదేశాలతో జాతరకు విద్యుత్ సౌకర్యం.

**సొంత నిధులతో గొల్ల,కురుమలకు విద్యుత్ సౌకర్యం కల్పించిన సర్పంచ్ తిరుపతి.**
**పోతారం(జే) గ్రామ సర్పంచ్ వాసాల తిరుపతి పనితీరుపై పలువురి హర్షం.**

**జనం వాయిస్, అక్కన్నపేట:**

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం పనిచేస్తున్నారని పోతారం జె సర్పంచ్ వాసాల తిరుపతి తెలిపారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామంలో కురుమ, యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీ చౌడాలమ్మ, బీరప్ప -కామారతి దేవి కళ్యాణ మహోత్సవం, పట్నాలు నిర్వహించుకోవడానికి ఘనంగా ఏర్పాటు చేసుకున్నప్పటికీ విద్యుత్ సౌకర్యం అందుబాటులో లేనందున అసౌకర్యానికి గురవుతున్నామని కుల పెద్దలు గ్రామ సర్పంచ్ వాసాల తిరుపతి దృష్టికి తీసుకు రావడంతో వెంటనే స్పందించిన సర్పంచ్ రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లి మంత్రి ఆదేశాల మేరకు పోతారం జె గ్రామంలో బీరప్ప దేవస్థానం వద్ద సర్పంచ్ వాసాల తిరుపతి తన సొంత నిధులతో సింగిల్ ఫేస్ మీటరు, ట్రాన్స్ఫారం సాంక్షన్ చేయించి బిగించడం జరిగిందన్నారు. అడిగిన వెంటనే తక్షణమే స్పందించి సహకరించినటువంటి మంత్రివర్యులకు, సర్పంచ్ కు, ఒకటవ వార్డు మెంబర్ గజ్జెల్లి సంపత్ కు, డిఇ, ఏడిఇ, ఏఈ, లైన్మెన్, విద్యుత్ శాఖ అధికారులందరికీ గొల్ల కురుమ సంఘం సభ్యులందరూ హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వాసాల లింగయ్య, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బండి కుమార్ గౌడ్, వనం సంపత్, చిరం రాజయ్య ,గజ్జెల్లి బిక్షపతి, చిర్రం అనిల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.





# మంచిర్యాల ధాన్యం కొనుగోళ్లలో భారీ అవినీతి: మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు

**తరుగు పేరుతో బస్తాకు 3.5 కిలోల కోత.. క్వింటాల్‌కు రూ.100 నష్టం**

**జనం వాయిస్, మంచిర్యాల, (మే 28):**

మంచిర్యాల నియోజకవర్గంలో వడ్ల కొనుగోలు ప్రక్రియ తీవ్ర అవినీతి, నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆరోపించారు. లక్షెట్టిపేటలోని ఐబి గెస్ట్ హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కలిసి రైతులను నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. తరుగు పేరిట బస్తాకు 3.5 కిలోల చొప్పున కట్ చేస్తూ, క్వింటాలుకు 100 రూపాయల వరకు నష్టం కలిగిస్తున్నారని, ఈ రూపంలో వస్తున్న దాదాపు 25 కోట్ల రూపాయల అక్రమ సొమ్ము అంతా ఎమ్మెల్యే జేబులోకే వెళ్తోందని ధ్వజమెత్తారు. దీనికి తోడు లారీ రవాణా పేరిట బస్తాకు 10 రూపాయలు, అన్‌లోడింగ్ కోసం మరో 7 రూపాయలు అక్రమంగా వసూలు చేయడం దుర్మార్గమన్నారు. జిల్లాలో పండిన ధాన్యంలో ఇప్పటివరకు సగం కూడా కొనలేదని, ఇంకా 40% కొనుగోళ్లు జరగాల్సి ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వడ్లను సకాలంలో తరలించకపోవడం వల్ల వర్షానికి తడిసి ముద్దవుతున్నాయని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షెట్టిపేటలో నలుగురు రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొన్నామని గుర్తు చేస్తూ.. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఎమ్మెల్యే హైదరాబాద్, మంచిర్యాల సెటిల్మెంట్లు పక్కన పెట్టి, ఇక్కడి రైతుల కష్టాలు తీర్చాలన్నారు. ప్రభుత్వం, అధికారులు చేస్తున్న నిర్లక్ష్యంతో రైతులు నష్టపోవద్దని, వర్షాలకు తడిసిన పంటలను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, లక్షెట్టిపేట పట్టణంలో జరుగుతున్న ఆస్తుల కూల్చివేతలపై అధికారులు స్పష్టత ఇవ్వాలన్నారు. కొలతలు చట్టప్రకారం జరుగుతున్నాయా లేక ఎమ్మెల్యే చెప్పినట్లు చేస్తున్నారా అనేది కలెక్టర్ గారు తేల్చాలని, బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, నల్మాస్ కాంతయ్య, పొడేటీ శ్రీనివాస్, చుంచు చిన్నయ్య, తిప్పని లింగయ్య, కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పెట్టం తిరుపతి, ఎక్కడి జుజనా-కుమార్, ఆసది పురుషోత్తం, అక్కల రవీందర్, రమణ తదితరులు పాల్గొన్నారు



దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక RNI NO:TGTEL/26/A0383 WWW.JANAMVOICE.COM

# చివరి గింజ వరకూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తాం.

**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.**
**వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు.**
**ఇసుక రవాణా వాహనాలను ధాన్యం కొనుగోలుకు వినియోగించాలి.**
**డిఫాల్ట్ రైస్ మిల్లులు బకాయిలు చెల్లిస్తే ధాన్యం కేటాయింపు.**
**మే నెలాఖరులోగా యాసంగి కొనుగోళ్లు పూర్తి చేయాలి.**
**ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన మంత్రి ఉత్తమ్.**








**జనం వాయిస్, పెద్దపల్లి, మే 28:**
ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు లతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు గత ప్రభుత్వంతో పోలిస్తే 25 నుంచి 30 శాతం అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.

15 నుంచి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు.

వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. మిల్లర్లకు ఏవైనా నష్టాలు వచ్చినా ప్రభుత్వం భరిస్తుందని, రైతులకు మాత్రం నష్టం జరగనివ్వమన్నారు.

రైతుల చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గతంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు బకాయిలు, వడ్డీలు చెల్లిస్తే తిరిగి ధాన్యం కేటాయింపులు ఇస్తామని తెలిపారు. రాబోయే 4 నుంచి 5 రోజుల పాటు ఇసుక రవాణా నిలిపివేసి వాహనాలను పూర్తిగా ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా, ఎఫ్‌సీఐ కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైందన్నారు. ఎఫ్‌సీఐ కేటాయింపులకు మించి అదనంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు.

డిసెంబర్ 2023 తర్వాత కనీస మద్దతు ధర విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తూ రైతులకు ఇప్పటివరకు అదనంగా రూ.16,479 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాల కారణంగా కేవలం 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తడిసిందని, ఆ ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. అవసరమైతే అదనపు గోదాములు అద్దెకు తీసుకుంటామని చెప్పారు.

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు సార్లు ధాన్యం కొనుగోళ్లు జరిగినప్పటికీ ఎక్కడా ఒక్క కిలో ధాన్యానికి కూడా తరుగు పేరుతో కోత విధించలేదన్నారు.
జిల్లాలో ఎక్కడైనా రైతుల నుంచి ఒక్క కేజీ ధాన్యం తరుగు తీసినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా మిల్లర్ల చేత రైతులకు పరిహారం ఇప్పిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున ధాన్యం పెద్దపల్లికి వస్తోందని, అందుకు అనుగుణంగా రైస్ కేటాయింపులు పెంచాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టే మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో యాసంగిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు రూ.788 కోట్ల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జూన్ 5 నాటికి 100 శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామని వెల్లడించారు.

ఆన్‌లైన్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్, రైతుల చెల్లింపుల్లో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాలో 6.9 లక్షల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 5.7 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగంలో ఉన్నాయని, ఇంకా 1.2 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులో ఉందన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసి అవసరమైన నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ
యాసంగి సీజన్ లో లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 185 కోనుగోలు కేంద్రాల ద్వారా 65 వేలు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి పెద్ద పల్లిలో 20 వేల వరంగల్ లో 20 వేల మెట్రిక్ టన్నుల, హన్మకొండ లో 10 వేల మెట్రిక్ టన్నులు మిల్లింగ్ కొరకు పౌరసరఫరాల శాఖ అలాట్మెంట్ చేసిందని తెలిపారు.

భూపాలపల్లి జిల్లాలో హర్వెస్టింగ్ కొన్ని ప్రాంతాలలో ఆలస్యంగా జరుగుతుందని, చాలా మండలాలో ఇంకా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావాల్సి ఉందని అన్నారు.

మంత్రి ఆదేశాల మేరకు 100 మట్టి, ఇసుక రవాణా వాహనాలను కూడా ధాన్యం కొనుగోళ్ల కోసం వినియోగిస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో స్టోరేజీ ప్లేస్ తక్కువగా ఉన్నందున ఇతర జిల్లాల మిల్లులకు కూడా ట్యాగ్ చేయాలని కోరారు.
అంతకుముందు పెద్ద కలవల్ల ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి గంగయ్య సురేష్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని కాలిందిని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎదురు ఎదురుగా ఢీకొన్న కారు బైక్.

- **ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలు.**
- **కుడి కాలు కుడి చేతికి బలంగా గాయాలు.**

**జనం వాయిస్, గోదావరిఖని, మే 28:**
పెద్దపల్లి జిల్లా రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం ప్రమాదం చోటుచేసుకుంది. 8 ఇంక్లైన్ ఆర్ జి 2 వకీల్ పల్లి గనిలో బదిలీ వర్కర్ గా పనిచేస్తున్నాడు. గురువారం రెండవ షిఫ్ట్ కి హాజరవ్వడానికి వెళ్తున్న సింగరేణి కార్మికుడు తోటి కార్మికుడిని పికప్ చేసుకొని పెట్రోల్ పోసుకొని వెళ్దాం అని సెంటినరీ కాలనీకి వెళ్తున్న క్రమం లో జేఎన్టీయూ సమీపం లో సెంటినరీ కాలనీ నుంచి వస్తున్న కారు నవీన్ అనే సింగరేణి ఉద్యోగి నీ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదం లో నవీన్ సింగరేణి కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. నవీన్ యొక్క కుడి కాలు లోపలి నుంచి గాయం అయింది. కుడి చేతి విరిగి లోపల ఎముక భాగం బయటికి రావడం తో తీవ్రమైన రక్త స్రావం అయింది. గాయపడ్డ వ్యక్తి నీ స్థానికులు గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పటల్ కి తరలించారు. మెరుగు అయిన వైద్యం కోసం గచ్చిబౌలి ఒమేగా హాస్పటల్ కి తరలిస్తున్నారు. కారు లో ప్రయాణిస్తున్న వారు అక్కడి నుంచి పారిపోయినట్టు బాధితుడు తెలిపాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి సంబంధిన వివరాలను సేకరిస్తున్నారు.







## ఆర్ జీ 2 రెస్క్యూ స్టేషన్ ను సింగరేణి సి & ఎమ్ డి సందర్శన

**- సింగరేణి సి & ఎం డి బుద్ద ప్రకాష్.**





**గోదావరిఖని మే 28 (జనం వాయిస్):**
రామగుండం రీజియన్ పరిధి లో ఆర్ జీ 2 సింగరేణి రెస్క్యూ స్టేషన్ ను గురువారం సింగరేణి సంస్థ చైర్మన్ సి & ఎమ్ డి బుద్ద ప్రకాష్ సందర్శించారు సింగరేణి సంస్థలో బాధ్యతలు చేపట్టి అప్పటి నుంచి మొదటి సారిగా రామగుండం రీజియన్ ను సందర్శించారు. అంతర్జాతీయ స్థాయి లో విశిష్ట ప్రతిభ కనబరిచిన రెస్క్యూ బృందాన్ని సి & ఎం డి బుద్ద ప్రకాష్ ప్రత్యేకంగా అభినందించారు. వారి అంకిత భావం, క్రమశిక్షణ, ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరింత బలో పేతమై సింగరేణి సంస్థకు, కార్మికులు విలువైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ డైరెక్టర్లు ఎల్ వి. సూర్యనారాయణ. కే. వెంకటేశ్వర్లు. ఎమ్ తిరుమల్ రావు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కో ఆర్డినేషన్&మార్కెటింగ్)టి శ్రీనివాస్, రామగుండం ఆర్ జీ 2 జిఎం బండి వెంకటయ్య .రెస్క్యూ జిఎం శ్రీనివాస్ రెడ్డి. రెస్క్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంచికి మారుపేరు వసంతం సార్

**మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్.**
**అంగన్వాడి పాఠశాలకు కూలర్ బహుకరించిన కుటుంబ సభ్యులు.**

**జనం వాయిస్, మంథని, మే 28:**
ఉద్యోగంలో గాని, వీధిలో కానీ, ఊర్లో కానీ మంచికి మారుపేరుగా ఎల్లంకి వసంతం సార్ నిలిచారని మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. గురువారం మంథని పట్టణంలోని మసీదు వాడ అంగన్వాడి పాఠశాలలో విశ్రాంత ఉద్యోగి స్వర్గీయ ఎల్లంకి వసంతం జయంతిని పురస్కరించుకుని వారి కుమారులు 13వ వార్డు కౌన్సిలర్ ఎల్లంకి వంశీధర్, వాసుదేవ్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల సౌకర్యార్థం కూలర్ ను బహుకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న వారి కుమారులు వంశీ, వాసు తమ తండ్రి స్మారకంగా చిన్నపిల్లలను వేసవి వేడి నుండి ఉపశమనం కలిగించేందుకు కూలర్ బహుకరించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు ఎల్లంకి రాధిక, ఎల్లంకి శ్రీలత,అనిరుద్, అక్షయ, నాయకులు ఎంఎస్ రెడ్డి, అలీమ్, అంగన్వాడీ టీచర్ జవహారి కుమారి లతో పాటు పలువురు పాల్గొన్నారు.



## రైతుల పక్షపాతి మంత్రి శ్రీధర్ బాబు

**రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం.**
**బిజెపి నేతల ఆరోపణ ఆవాస్తవం.**
**డిసిసి అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్.**

**జనం వాయిస్, మంథని, మే 28:**
రాష్ట్రంలోని రైతులందరి సంక్షేమమే లక్ష్యంగా తమ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పెద్దపల్లి డిసిసి అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రైతు భరోసా పర్యటన భాగంగా మంథనిలో పర్యటించిన బిజెపి నాయకులు తమ నేత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ ప్రభుత్వం పై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా తమ ఉనికిని చాటు కోవడం కోసం బిజెపి నాయకులు చేసిన ఆరోపాలు అవాస్తవమన్నారు. మంథని నియోజకవర్గం తో పాటు రాష్ట్రంలోని రైతులందరికీ సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వారి కోసం ఎరువులు, విత్తనాలు, సాగు



నీరు అందుబాటులో ఉంచు ఉంచుతూ ఆదుకుంటున్నారన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర చెల్లించడంతోపాటు అదనంగా మరో 500 బోనస్ చెల్లిస్తూ రైతులను ఆదుకుంటున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో కురిసే అకాల వర్షాలతో తడిసిన రంగు మారిన ధాన్యాన్ని సైతం తమ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకుంటామని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఐటీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు ప్రకటించిన విషయం బిజెపి నాయకులకు తెలియకపోవడం విచారకరమన్నారు. రైతులకు అందుబాటులో గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను కల్పించిందన్నారు. అక్కడక్కడ ఉన్న చిన్న సమస్యలను భూతద్దంలో పెట్టి చూపడంత కదా అన్నారు. బిజెపి నాయకులు ఎన్నడు రైతుల పక్షాన నిలబడి మాట్లాడింది కానీ వారిని ఆదుకున్న తీరు చరిత్రలో లేదన్నారు. ఇప్పటికైనా రాజకీయానికి కోసం బిజెపి నేతలు తమ ప్రభుత్వాన్ని బదనాం చేయడం మానుకోవాలన్నారు.

# చింతపండు చారు మహిమ

- రుచితో పాటు ఆరోగ్యానికి మేలు.
- వేసవిలో శరీరానికి చల్లదనం.
- ఇంటి వంటల్లో ప్రత్యేక స్థానం.



**జనం వాయిస్, డెస్క్, 28 మే:**
తెలుగు ఇళ్లలో తరతరాలుగా వండుతున్న సంప్రదాయ వంటకాలలో చింతపండు చారు ఒకటి. తక్కువ పదార్థాలతో సులభంగా తయారయ్యే ఈ చారు రుచితో పాటు ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా వేడి కాలంలో అన్నంలో చింతపండు చారు వేసుకుని తింటే శరీరానికి తేలికగా అనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఈ వంటకం ఇప్పటికీ ప్రతి ఇంట్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. చింతపండులో సహజంగా ఉండే పులుపు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. భోజనం చేసిన తర్వాత కడుపు బరువుగా అనిపించడం, అజీర్ణం వంటి సమస్యలను తగ్గించడంలో చింతపండు చారు ఉపయోగపడుతుందని ఆహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో వేసే వెల్లుల్లి, జీలకర్ర, మిరియాలు వంటి పదార్థాలు శరీరానికి శక్తిని అందిస్తూ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే చాలా మంది అనారోగ్య సమయంలో కూడా చింతపండు చారు తినేందుకు ఇష్టపడతారు. వేసవిలో శరీరంలో నీటి లోపం ఏర్పడకుండా ఉండేందుకు కూడా ఈ చారు సహాయపడుతుంది. చెమట ఎక్కువగా వచ్చే రోజుల్లో తేలికపాటి ఆహారంతో పాటు చింతపండు చారు తీసుకుంటే శరీరానికి ఉపశమనం లభిస్తుంది. కారం తక్కువగా, మసాలాలు సమతుల్యంగా ఉండటం వల్ల చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ దీనిని సులభంగా తినగలుగుతారు. వేడి అన్నంలో నెయ్యి వేసుకుని చింతపండు చారు కలిపితే వచ్చే రుచి ప్రత్యేకంగా ఉంటుంది. చింతపండు చారు తయారీ విధానం కూడా చాలా సులభం. ముందుగా చింతపండును నీటిలో నానబెట్టి రసం తీసుకోవాలి. తరువాత పాన్‌లో నూనె వేసి ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, వెల్లుల్లి వేయించి అందులో చింతరసం కలపాలి. తగినంత ఉప్పు, కారం, పసుపు వేసి కొద్దిసేపు మరిగిస్తే రుచికరమైన చారు సిద్ధమవుతుంది. కొందరు టమాటా, ఉల్లిపాయ కూడా వేసి మరింత రుచిగా తయారు చేస్తుంటారు. ఆధునిక ఆహారపు అలవాట్ల మధ్య కూడా సంప్రదాయ వంటకాల ప్రాధాన్యం తగ్గడం లేదు. ఆరోగ్యకరమైన ఇంటి ఆహారం వైపు ప్రజలు మళ్లీ ఆసక్తి చూపుతున్న సమయంలో చింతపండు చారు వంటి వంటకాలు మరింత ప్రాచుర్యం పొందుతున్నాయి. రుచిని, ఆరోగ్యాన్ని కలిపిన ఈ సంప్రదాయ వంటకం తెలుగు వారి భోజన సంస్కృతిలో ఎప్పటికీ ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది.



# పాత బట్టలతో ఇల్లు తుడవచ్చా?

- ఖర్చు తగ్గించే సులభ మార్గం.
- సరైన బట్టలు ఎంచుకోవడం ముఖ్యం.
- శుభ్రతలో జాగ్రత్తలు అవసరం.

**జనం వాయిస్, డెస్క్, 28 మే:**
ఇంట్లో పాతబడిన బట్టలను చాలామంది శుభ్రపరిచే పనులకు ఉపయోగిస్తుంటారు. ముఖ్యంగా నేల తుడవడం, ఫర్నిచర్ శుభ్రం చేయడం, కిటికీలు తుడవడం వంటి పనుల్లో పాత గుడ్డలు ఉపయోగించడం సాధారణంగా కనిపించే విషయం. ఇలా చేయడం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా ఉపయోగం లేని బట్టలకు మరో ఉపయోగం లభిస్తుంది. అయితే ఏ బట్టలైనా వాడకుండా కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. పాత కాటన్ బట్టలు ఇంటి శుభ్రత పనులకు బాగా ఉపయోగపడతాయి. ఇవి నీటిని త్వరగా పీల్చుకోవడంతో పాటు దుమ్మును సులభంగా



తొలగిస్తాయి. టీ షర్టులు, పాత చీరలు, తువ్వాళ్లు వంటి బట్టలను చిన్న ముక్కలుగా కట్ చేసి ఉపయోగిస్తే మరింత సౌకర్యంగా ఉంటుంది. మృదువైన బట్టలు ఫర్నిచర్‌పై గీతలు పడకుండా కూడా కాపాడుతాయి. అయితే చాలా మురికిగా ఉన్న లేదా చెడు వాసన వచ్చే బట్టలను ఉపయోగించకూడదు. అలాంటి బట్టల్లో బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వంటగది, పిల్లలు ఉండే గదులు శుభ్రం చేసే సమయంలో పరిశుభ్రమైన గుడ్డలు మాత్రమే వాడాలి. ఒకసారి ఉపయోగించిన తర్వాత బట్టలను శుభ్రంగా కడిగి ఎండలో ఆరబెట్టడం మంచిది. రసాయన క్లీనర్లతో కలిసి ఉపయోగించే సమయంలో కూడా జాగ్రత్త అవసరం. కొన్నిసార్లు బలమైన కెమికల్స్ వల్ల బట్టలు త్వరగా పాడవుతాయి. చేతులకు ఇబ్బంది కలగకుండా గ్లోవ్స్ ధరించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. శుభ్రత కోసం వాడే బట్టలను ఇతర బట్టలతో కలపకుండా వేరుగా ఉంచడం కూడా అవసరం. పాత బట్టలను సరైన విధంగా వినియోగిస్తే అవి ఇంటి పనుల్లో ఎంతో ఉపయోగపడతాయి. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది చిన్న సహాయంగా నిలుస్తుంది. ఉపయోగం లేని వస్తువులను మళ్లీ ఉపయోగించడం ద్వారా డబ్బు ఆదా కావడంతో పాటు ఇంటి శుభ్రతను కూడా సులభంగా నిర్వహించుకోవచ్చు.

# తలకు నూనెతో జుట్టుకు బలం



**జనం వాయిస్, డెస్క్, 28 మే:**
ప్రస్తుతం చిన్న వయసులోనే జుట్టు రాలడం, పొడిబారడం, చుండ్రు వంటి సమస్యలు చాలామందిని వేధిస్తున్నాయి. కాలుష్యం, ఒత్తిడి, సరైన ఆహారం లేకపోవడం వల్ల జుట్టు బలహీనపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో తలకు నూనె రాయడం చాలా ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే నూనెను ఎంతసార్లు రాయాలి అనే విషయంలో చాలామందికి సందేహాలు ఉన్నాయి. సాధారణంగా వారానికి రెండు నుంచి మూడు సార్లు నూనె రాయడం జుట్టుకు మంచిదని సూచిస్తున్నారు. తలకు నూనె రాయడం వల్ల తల చర్మానికి తేమ అందుతుంది. దీంతో జుట్టు పొడిబారకుండా మెత్తగా ఉంటుంది. ముఖ్యంగా కొబ్బరి నూనె, నువ్వుల నూనె, బాదం నూనెలు జుట్టుకు మంచి పోషణ ఇస్తాయని చెబుతున్నారు. నూనెను కొద్దిగా గోరువెచ్చగా చేసి మెల్లగా మసాజ్ చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీంతో జుట్టు కుదుళ్లు బలపడే అవకాశం ఉంటుంది. చాలామంది రోజూ నూనె రాస్తే జుట్టు ఇంకా బాగుంటుందని భావిస్తారు. కానీ అతిగా నూనె రాయడం కూడా మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ నూనె వల్ల దుమ్ము, మురికి తలకు త్వరగా అంటుకునే అవకాశం ఉంటుంది. కొన్నిసార్లు చుండ్రు సమస్య కూడా పెరిగే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అందుకే తలకు అవసరమైన మోతాదులో మాత్రమే నూనె వాడాలని సూచిస్తున్నారు. పొడి జుట్టు ఉన్నవారు వారానికి

- వారానికి రెండు నుంచి మూడు సార్లు మంచిదంటున్న నిపుణులు.
- సరైన విధంగా రాస్తే జుట్టు రాలడం తగ్గే అవకాశం.

మూడు సార్లు నూనె రాయవచ్చు. ఆయిలీ జుట్టు ఉన్నవారు మాత్రం వారానికి ఒకటి లేదా రెండు సార్లు సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. చుండ్రు సమస్య ఉన్నవారు కొబ్బరి నూనెలో కొన్ని చుక్కల టీ ట్రీ నూనె కలిపి వాడితే కొంత ఉపశమనం లభించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. నూనె రాయడమే కాకుండా సరైన ఆహారం కూడా జుట్టు ఆరోగ్యానికి చాలా అవసరం. ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారం, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తగినంత నీరు తాగడం, మంచి నిద్రపోవడం, ఒత్తిడి తగ్గించుకోవడం వల్ల కూడా జుట్టు బలంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.



# అలసందల ఆరోగ్య రహస్యం

**జనం వాయిస్, డెస్క్, 28 మే:**
తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా ఉపయోగించే పప్పుధాన్యాలలో అలసందలు ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఈ ఆహారం గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు పట్టణాల్లో కూడా ఆదరణ పొందుతోంది. అలసందలతో కూరలు, గుగ్గిళ్లు, పులుసులు తయారు చేసుకుని తింటారు. రుచికరంగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి కూడా ఇవి ఎంతో మేలు చేస్తాయని ఆహార నిపుణులు చెబుతున్నారు. అలసందల్లో ప్రోటీన్లు, పీచు పదార్థాలు, ఇనుము, కాల్షియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. శరీరానికి శక్తిని అందించడంలో ఇవి సహాయపడతాయి. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు అలసందలు మంచి పోషకాహారంగా ఉపయోగపడతాయని వైద్యులు సూచిస్తున్నారు. రక్తహీనత సమస్యను తగ్గించడంలో కూడా ఇవి ఉపయోగకరమని చెబుతున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో



అలసందలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే పీచు పదార్థాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. రక్తపోటును నియంత్రించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. తరచూ అలసందలు తీసుకునే వారిలో గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తక్కువగా ఉండే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలని భావించే వారికి కూడా అలసందలు మంచి ఆహారంగా పరిగణించబడుతున్నాయి. వీటిని తింటే ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. దీంతో అనవసరంగా ఎక్కువ ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా అలసందలు సహాయపడతాయి. అందుకే ఆరోగ్యకరమైన ఆహార పట్టికలో వీటికి ప్రత్యేక స్థానం ఇస్తున్నారు. ఆధునిక ఆహారపు అలవాట్ల మధ్య సంప్రదాయ ధాన్యాల ప్రాముఖ్యత మళ్లీ పెరుగుతోంది. సహజ పోషకాలతో నిండిన అలసందలను వారంలో కనీసం రెండు సార్లు ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రుచిని, ఆరోగ్యాన్ని కలిపిన ఈ సంప్రదాయ ఆహారం ఆరోగ్యకర జీవనశైలికి మంచి ఎంపికగా నిలుస్తోంది.

# కడుపు ఆరోగ్యమే అసలు బలం

- జీర్ణక్రియ బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యం.
- ఆహార అలవాట్లే కడుపు సమస్యలకు కారణం.
- చిన్న జాగ్రత్తలతో పెద్ద వ్యాధులకు దూరం.

**జనం వాయిస్, డెస్క్, 28 మే:**
మనిషి ఆరోగ్యానికి కడుపు కీలక కేంద్రంగా పనిచేస్తుంది. జీర్ణక్రియ సరిగా జరిగితే శరీరానికి కావాల్సిన శక్తి, పోషకాలు సమతుల్యంగా అందుతాయి. కానీ ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, బయట ఆహారంపై అధికంగా ఆధారపడటం వల్ల కడుపు సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. చిన్న సమస్యగా మొదలయ్యే గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి ఇబ్బందులు తరువాత పెద్ద ఆరోగ్య సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదయం అల్పాహారం మానేయడం, రాత్రిళ్లు ఆలస్యంగా భోజనం చేయడం, వేయించిన పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వంటి అలవాట్లు జీర్ణవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా యువతలో ఫాస్ట్ ఫుడ్ వినియోగం పెరగడంతో కడుపు ఆరోగ్యం దెబ్బతింటోందని చెబుతున్నారు. శరీరానికి అవసరమైన ఫైబర్, సహజ పోషకాలు తగ్గిపోవడంతో పేగుల పనితీరు మందగిస్తోంది. ఫలితంగా అలసట, చిరాకు, ఆకలి లేకపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. నీటిని సరిపడా తాగకపోవడం కూడా కడుపు సమస్యలకు ప్రధాన కారణంగా మారుతోంది. రోజంతా శరీరానికి అవసరమైన నీరు అందకపోతే జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల మలబద్ధకం, కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు ఎక్కువ అవుతాయి. వైద్యులు రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల వరకు నీరు తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే పండ్లు, ఆకుకూరలు, పెరుగు వంటి సహజ ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. ఒత్తిడి కూడా కడుపు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. మానసిక ఆందోళన ఎక్కువైతే జీర్ణవ్యవస్థ పనితీరు దెబ్బతింటుంది. అందుకే సరిపడా నిద్ర, వ్యాయామం, యోగా వంటి అలవాట్లు కడుపు ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. రోజూ కనీసం అరగంట నడక కూడా జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని సూచిస్తున్నారు. చిన్న చిన్న అలవాట్లను మార్చుకుంటే కడుపు ఆరోగ్యాన్ని సులభంగా కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. సమయానికి ఆహారం తీసుకోవడం, బయట ఆహారాన్ని తగ్గించడం, తగినంత నీరు తాగడం, శారీరక శ్రమ పెంచడం వంటి మార్పులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొంటున్నారు. కడుపు ఆరోగ్యం బాగుంటేనే శరీరం మొత్తం చురుకుగా పనిచేస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ జీర్ణవ్యవస్థ సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచిస్తున్నారు.



RNI NO:TGTEL/26/A0383
దినమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM



# కేన్ విలియమ్సన్ వరల్డ్ రికార్డ్

న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్లు కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్ అరుదైన ప్రపంచ రికార్డును తమ పేరిట నమోదు చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 12 వేర్వేరు దేశాల్లో టెస్ట్ క్రికెట్ ఆడిన తొలి జంటగా చరిత్ర సృష్టించారు. ఐర్లాండ్‌తో బెల్‌ఫాస్ట్ వేదికగా జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు వరకు కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్‌లు 11 దేశాల్లో టెస్ట్ మ్యాచ్‌లు ఆడి షేన్ వార్న్, క్రిస్ గేల్, శివనారాయణ్ చంద్రపాల్‌తో పాటు పలువురు పాకిస్థాన్ మాజీ ఆటగాళ్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. అయితే ఐర్లాండ్‌లో అడుగుపెట్టడంతో ఆ రికార్డును అధిగమించి కొత్త చరిత్ర సృష్టించారు. ఇదిలా ఉండగా, బెల్‌ఫాస్ట్ టెస్టులో న్యూజిలాండ్ బ్యాటర్లు భారీ స్కోరు దిశగా దూసుకెళ్తున్నారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ జట్టు 5 వికెట్ల నష్టానికి 361 పరుగులు చేసింది. టామ్ బ్లండెల్ 142 పరుగులతో అజేయంగా నిలవగా, డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ 38 పరుగులతో క్రీజులో ఉన్నాడు. అంతకుముందు రచిన్ రవీంద్ర అద్భుత సెంచరీతో 121 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. ఈ మ్యాచ్‌లో కేన్ విలియమ్సన్ 36 పరుగులు చేసి పర్వాలేదనిపించగా, టామ్ లాథమ్ మాత్రం ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. అయినప్పటికీ ఈ ఇద్దరూ కలిసి సృష్టించిన అరుదైన రికార్డు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. 2010లో భారత్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన కేన్ విలియమ్సన్, తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాదుతూ ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. అతడి నాయకత్వంలో న్యూజిలాండ్ 2021లో తొలి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకుంది. ఇప్పటివరకు 109 టెస్టుల్లో 9,497 పరుగులు చేసిన విలియమ్సన్, ప్రపంచ అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందాడు. మరోవైపు టామ్ లాథమ్ ఇప్పటివరకు 92 టెస్టులు ఆడి 16 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలతో 6,261 పరుగులు సాధించాడు. ఓపెనర్‌గా జట్టుకు ఎన్నో కీలక ఇన్నింగ్స్ ఆడిన లాథమ్ కూడా న్యూజిలాండ్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు.

# పసిడి, వెండి ధరలకు భారీ షాక్.

అంతర్జాతీయ మార్కెట్‌లో బులియన్ ధరలు తగ్గడం, డాలర్ బలపడటం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్నాయన్న సంకేతాలతో దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు పుంజుకోవడంతో మదుపరులు సురక్షిత పెట్టుబడులైన బంగారం వైపు ఆసక్తి తగ్గించినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గురువారం ఉదయం పరిస్థితి ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,060గా నమోదైంది. ఇది నిన్నటి ధరతో పోలిస్తే రూ.2,230 మేర తగ్గడం విశేషం. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,43,050కు చేరుకుంది. ఈ విభాగంలో కూడా రూ.2,050 మేర తగ్గుదల కనిపించింది. మరోవైపు వెండి ధరల్లోనూ భారీ పతనం నమోదైంది. ఒక్కరోజులోనే కిలో వెండి ధర దాదాపు రూ.10 వేల మేర పడిపోయింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,85,000గా కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,75,000గా ఉండగా.. చెన్నైలో రూ.2,85,000, బెంగళూరులో రూ.2,75,000గా నమోదైంది. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ మారకం విలువ, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాలు, ముడి చమురు ధరల మార్పులు వంటి అంశాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిస్థితులను బట్టి ధరల్లో మరింత మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



# సచిన్ ప్రశంసించిన వైభవ్ తుఫాన్



ఐపీఎల్-2026 ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ సంచలన ఇన్నింగ్స్‌తో క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అతడు 29 బంతుల్లో 97 పరుగులు చేసి సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ పాట్ కమిన్స్ బౌలింగ్‌ను ధాటిగా ఎదుర్కొంటూ స్టేడియంను హోరెత్తించాడు. ఈ అద్భుత ప్రదర్శనపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసలు కురిపించాడు. వైభవ్ బ్యాటింగ్ తీరుపై స్పందించిన సచిన్, అతడి బ్యాట్ స్వింగ్ అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. కాళ్ల వైపు వచ్చే బంతులను ఫ్రంట్ ఫుట్ క్లియర్ చేసి పక్కకు జరుగుతూ ఆడే విధానం తనను బాగా ఆకట్టుకుందని తెలిపారు. ఈ స్వేచ్ఛే అతడిని తనదైన శైలిలో ఆడేలా చేస్తోందని కొనియాడారు. వైభవ్ ఆడిన ఇన్నింగ్స్ నిజంగా అసాధారణమని సచిన్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ మ్యాచ్‌లో వైభవ్ మొత్తం 12 భారీ సిక్సర్లు బాదుతూ ప్రత్యర్థి బౌలర్ల వ్యూహాలను పూర్తిగా ధ్వంసం చేశాడు. తక్కువ బంతుల్లోనే భారీ స్కోరు సాధించి పలు రికార్డులను తిరగరాశాడు. అతడి దూకుడు బ్యాటింగ్‌తో రాజస్థాన్ రాయల్స్ భారీ స్కోరు నమోదు చేయగలిగింది. వైభవ్ ప్రదర్శన చూసిన క్రికెట్ అభిమానులు, విశ్లేషకులు అతడిని భారత క్రికెట్ భవిష్యత్ స్టార్‌గా అభివర్ణిస్తున్నారు. చిన్న వయసులోనే ఒత్తిడిని అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ఆడుతున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. భవిష్యత్తులో భారత జట్టుకు అతడు కీలక ఆటగాడిగా మారే అవకాశాలు ఉన్నాయని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# వైభవ్ తుఫాన్‌తో ఎస్ఆర్‌హెచ్ ఔట్

టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. నిర్ణీత 20 ఓవర్లలో రాజస్థాన్ 243 పరుగుల భారీ స్కోరు నమోదు చేసి హైదరాబాద్ ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచింది. ఈ మ్యాచ్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన ఆటగాడు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. అతడు కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపించిన వైభవ్ ధాటికి హైదరాబాద్ బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు. కెప్టెన్ పాట్ కమిన్స్ వేసిన వ్యూహాలు ఏవీ పనిచేయలేదు. 244 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్‌కు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. ఇంగ్లాండ్ స్పీడ్ స్టార్ జోఫ్రా ఆర్చర్ తన వేగవంతమైన బౌలింగ్‌తో టాప్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయిన హైదరాబాద్ ఒత్తిడిలో పడింది. మధ్యలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నితీశ్ కుమార్ రెడ్డి 38 పరుగులతో పోరాడినా జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లలేకపోయాడు. చివరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 192 పరుగులకే పరిమితమై 51 పరుగుల తేడాతో ఘోర ఓటమి చవిచూసింది. ఈ పరాజయంతో హైదరాబాద్ టోర్నీ నుంచి నిష్క్రమించగా, సోషల్ మీడియాలో అభిమానుల ట్రోలింగ్ మొదలైంది. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులు సన్‌రైజర్స్ ఓనర్ కావ్య మారన్‌పై మీమ్స్, పాత వీడియోలు షేర్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. లీగ్ దశలో చెన్నైపై గెలిచినప్పుడు ఆమె చేసిన సంబరాలను గుర్తుచేస్తూ ఇప్పుడు కౌంటర్లు ఇస్తున్నారు. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన హైదరాబాద్ ఎలిమినేటర్ దశలోనే నిష్క్రమించడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.



# జూన్ నుంచి హ్యుందాయ్ కార్లు ఖరీదు.

## కొనుగోలుదారులకు భారీ షాక్

సౌత్ కొరియాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా.. కారు కొనుగోలుదారులకు షాకింగ్ న్యూస్ చెప్పింది. వచ్చే నెల జూన్ 1వ తేదీ నుంచి తమ కార్ల ధరలను పెంచనున్నట్లు కంపెనీ అధికారికంగా ప్రకటించింది. మోడల్, వేరియంట్‌ను బట్టి గరిష్ఠంగా రూ.12,800 వరకు ధరలు పెరగనున్నట్లు వెల్లడించింది. నిజానికి కార్ల ధరలను మే నెల నుంచే ఒక శాతం వరకు పెంచాలని హ్యుందాయ్ సంస్థ ఏప్రిల్‌లోనే ప్రకటించింది. అయితే కొన్ని అంతర్గత కారణాలతో ఆ నిర్ణయాన్ని జూన్‌కు వాయిదా వేసింది. ఇప్పుడు ఆ పెంపు అమల్లోకి రానుండటంతో కొత్త కారు కొనాలనుకునే వారికి అదనపు భారం తప్పదని తెలుస్తోంది. ఈ ధరల పెంపుకు గల కారణాలను కూడా కంపెనీ వివరించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆటోమొబైల్ రంగానికి అవసరమైన ముడిసరకుల ధరలు భారీగా పెరగడం, ఉత్పత్తి వ్యయాలు అధికమవడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని హ్యుందాయ్ తెలిపింది. గత కొంతకాలంగా పెరుగుతున్న అదనపు భారాన్ని సంస్థే భరిస్తూ వచ్చిందని, కానీ ప్రస్తుతం పరిస్థితులు దృష్ట్యా ధరలు పెంచడం తప్పనిసరి అయిందని కంపెనీ పేర్కొంది. భారత మార్కెట్‌లో హ్యుందాయ్‌కు చెందిన క్రెటా, ఐ20, వెన్యూ, ఎక్స్టర్ వంటి మోడళ్లకు భారీ డిమాండ్ ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఈ కార్లను కొనుగోలు చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కారు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారు జూన్ 1కు ముందే బుకింగ్ పూర్తి చేస్తే ప్రస్తుతం ఉన్న ధరలకే వాహనం పొందే అవకాశం ఉండొచ్చని ఆటోమొబైల్ డీలర్లు సూచిస్తున్నారు.



# హైదరాబాద్‌లో ఈబీజీ గ్రూప్ భారీ విస్తరణ



ఈబీజీ గ్రూప్ హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో కొత్త తయారీ, అసెంబ్లింగ్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌ను ఏర్పాటు చేసింది. రూ.25 కోట్ల పెట్టుబడితో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ యూనిట్‌ను 'వజ్రం ఎలక్ట్రిక్' పేరుతో నిర్వహించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇప్పటికే నగరంలో అడ్వాన్స్‌డ్ అసెంబ్లింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్న ఈబీజీ గ్రూప్.. ఇప్పుడు వ్యాపార విస్తరణలో మరో కీలక అడుగు వేసింది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, వ్యాపార కార్యకలాపాలను మరిన్ని రంగాలకు విస్తరించాలనే లక్ష్యంతో ఈ కొత్త యూనిట్‌ను ప్రారంభించినట్లు ఈబీజీ గ్రూప్ వ్యవస్థాపకుడు ఇర్ఫాన్ ఖాన్ తెలిపారు. ప్రారంభ దశలోనే రూ.25 కోట్ల పెట్టుబడి పెట్టామని, భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు పెట్టే ప్రణాళిక ఉందని ఆయన వెల్లడించారు. ఈ కొత్త యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 450 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈబీజీ గ్రూప్ ఎలక్ట్రిక్ మొబిలిటీ, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, నిర్మాణ రంగం, ఆహార మరియు పానీయాలు, మౌలిక సదుపాయాలు, ఆతిథ్య రంగాల్లో సేవలు అందిస్తోంది. కొత్త యూనిట్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశముందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# హెల్మెట్లు, అంబులెన్స్‌లపై జీఎస్టీ తగ్గించాలి..

హెల్మెట్లు, అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య పరికరాలపై ప్రస్తుతం అమలులో ఉన్న వస్తు సేవల పన్ను తగ్గించాలని లేదా పూర్తిగా రద్దు చేయాలని గ్లోబల్ రోడ్ సేఫ్టీ సంస్థ ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఐఆర్‌ఎఫ్ గౌరవ అధ్యక్షుడు కేకే కపిల ప్రధానికి లేఖ రాశారు. ప్రస్తుతం హెల్మెట్లపై 18 శాతం జీఎస్టీ విధిస్తున్నారని, అయితే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడడంలో హెల్మెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య పరికరాలపై కూడా జీఎస్టీ భారాన్ని తొలగించాలని సూచించారు. ముఖ్యంగా ఆక్సిజన్ సాంద్రీకరణ యంత్రాలు, మానిటర్లు, వీల్‌చైర్లు, ఇంప్లాంట్లు, ఇతర అత్యవసర ఆరోగ్య పరికరాలపై పన్ను పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రత, అత్యవసర వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలంటే ఈ నిర్ణయం అవసరమని ఐఆర్‌ఎఫ్ అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించేందుకు భద్రతా పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమని సంస్థ పేర్కొంది.




# మెటా కొత్త పెయిడ్ ప్లాన్లు.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో ప్రత్యేక ఫీచర్లు




ప్రపంచ ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా వినియోగదారుల కోసం కొత్త పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వేదికలపై ప్రత్యేక ఫీచర్లు అందించేలా ఈ చెల్లింపు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ ప్లాన్లు ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. స్టోరీలు, ప్రొఫైళ్లు, చాట్‌లు, రియాక్షన్‌లు, పోస్టులపై మరింత నియంత్రణ కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ సేవలను రూపొందించినట్లు మెటా వెల్లడించింది. క్రియేటర్లు, వ్యాపార సంస్థలు, కృత్రిమ మేధ సాధనాలను ఎక్కువగా వినియోగించే వారికోసం 'మెటా వన్' పేరుతో ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ సేవలను కూడా తీసుకొచ్చింది. ప్రస్తుతం ఇవి 'మెటా వెరిఫైడ్' సేవలకు భిన్నంగా పనిచేస్తాయని సంస్థ తెలిపింది. ఫేస్‌బుక్ ప్లస్, ఇన్‌స్టాగ్రామ్ ప్లస్ ప్లాన్ల ధరను నెలకు 3.99 డాలర్లుగా నిర్ణయించారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.362 వరకు ఉంటుంది. ఇక వాట్సాప్ ప్లస్ ధర నెలకు 2.99 డాలర్లు కాగా, భారత కరెన్సీలో దాదాపు రూ.271గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్ ప్లస్ వినియోగదారులకు ప్రత్యేక స్టోరీ నియంత్రణలు, స్టోరీలను మళ్లీ చూసిన వారి వివరాలు తెలుసుకునే అవకాశం, వీక్షకుల జాబితాలో శోధన సదుపాయం, స్టోరీలను 24 గంటలకు మించి పొడిగించే అవకాశం వంటి ఫీచర్లు అందుబాటులో ఉంటాయి. అదనంగా వారానికి ఒకసారి స్టోరీని ప్రత్యేకంగా ప్రోత్సహించే సదుపాయం కూడా కల్పించారు. ఇక మెటా వన్ ప్లస్ ప్లాన్ ధర నెలకు 7.99 డాలర్లు కాగా, మెటా వన్ ప్రీమియం ప్లాన్ ధర నెలకు 19.99 డాలర్లుగా ఉంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.725 నుంచి రూ.1,814 వరకు ఉంటుంది. ఈ ప్రీమియం ప్లాన్లలో అధునాతన కృత్రిమ మేధ ఫీచర్లు, మరిన్ని ఫొటోలు, వీడియోలు రూపొందించే సదుపాయాలు, లోతైన విశ్లేషణ సామర్థ్యాలు లభించనున్నాయి. సాధారణ వినియోగదారులకు మెటా ఏఐ సేవలు ఉచితంగానే కొనసాగుతాయని సంస్థ స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే ఓటీటీలు, సంగీత యాప్‌లు, క్లౌడ్ స్టోరేజ్, ఫుడ్ డెలివరీ సభ్యత్వాల కోసం చెల్లింపులు చేస్తున్న వినియోగదారులకు ఈ కొత్త ప్లాన్లు అదనపు ఆర్థిక భారంగా మారే అవకాశముందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# రూపమే ఇప్పుడు తన స్టైల్ అంటున్న సమీరా రెడ్డి



టాలీవుడ్‌లో ఒకప్పుడు తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సమీరా రెడ్డి.. ప్రస్తుతం సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచారు. 2005లో వచ్చిన 'నరసింహుడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన సమీరా.. ఆ తర్వాత మెగాస్టార్ చిరంజీవి నటించిన 'జై చిరంజీవ' చిత్రంతో మరింత గుర్తింపు సంపాదించారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైన సమీరా రెడ్డి.. ఇటీవల తన వ్యక్తిగత జీవితం, శరీరాకృతి మార్పుల గురించి ఓపెన్‌గా మాట్లాడుతున్నారు. ముఖ్యంగా బిడ్డ పుట్టిన తర్వాత హార్మోన్ల అసమతుల్యత కారణంగా తాను తీవ్రంగా బరువు పెరిగానని గతంలో వెల్లడించారు. ఒక దశలో తన బరువు 105 కిలోలకు పైగా వెళ్లిందని, ఆ సమయంలో సామాజిక మాధ్యమాల్లో తీవ్ర ట్రోలింగ్ ఎదుర్కొన్నానని చెప్పారు. తాజాగా సోషల్ మీడియాలో చేసిన పోస్టులో సమీరా తన ఆలోచనలను పంచుకున్నారు. గతంలో అందంగా కనిపించాలి, ఫిట్‌గా ఉండాలి, గ్లామరస్‌గా కనిపించాలనే ఒత్తిడి తనపై చాలా ఉండేదని తెలిపారు. కానీ ఇప్పుడు మాత్రం ఆ ఒత్తిడిని పూర్తిగా వదిలేశానని చెప్పారు. "ఇప్పుడైతే నా రూపమే నా స్టైల్‌గా మారింది. నేను ఎలా ఉన్నానో అలా ఉండటంలోనే సంతోషాన్ని కనుగొన్నాను. ఒత్తిడిని వదిలించుకున్న తర్వాత జీవితం, మన వైబ్ పూర్తిగా మారిపోతాయి" అంటూ సమీరా పేర్కొన్నారు. స్టైలిష్ దుస్తులు ధరించడం, గ్లామర్‌గా కనిపించడం వంటి విషయాలపై ఇప్పుడు తనకు పెద్దగా ఆసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. గతంలో ఇతరుల అభిప్రాయాల గురించి ఎక్కువగా ఆలోచించేదాన్నని, కానీ ఇప్పుడు తనను తాను అంగీకరించడం నేర్చుకున్నానని తెలిపారు. తన బరువు పెరిగిన సమయంలో చాలామంది కఠిన వ్యాఖ్యలు చేశారని, దగ్గర వాళ్లు కూడా విమర్శించారని సమీరా గుర్తుచేసుకున్నారు. అయితే ఆ విమర్శలు తనను పూర్తిగా కుంగదీయలేదని చెప్పారు. జీవితం అంటే కేవలం అందం మాత్రమే కాదని, మనసుకు నచ్చినట్లుగా జీవించడం ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం సమీరా రెడ్డి సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ.. సోషల్ మీడియాలో మాత్రం చురుకుగా ఉంటూ మహిళల ఆరోగ్యం, మానసిక ఒత్తిడి, శరీర స్వీకరణ వంటి అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు.

# ఓటీటీలోకి వచ్చిన ధనుష్ 'కర'




ధనుష్ హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ హీస్ట్ థ్రిల్లర్ మూవీ కర తాజాగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. దర్శకుడు విఘ్నేష్ రాజా రూపొందించిన ఈ చిత్రం థియేటర్లలో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయినా.. ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్ ద్వారా మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమైంది. ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక లో తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్ సౌకర్యంతో కూడా సినిమా అందుబాటులోకి రావడంతో పాన్ ఇండియా ప్రేక్షకులకు చేరువైంది. హీస్ట్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ సినిమాలో ధనుష్ తనదైన స్టైల్‌లో ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. సస్పెన్స్, యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్ మేళవింపుతో దర్శకుడు కథను రూపొందించినప్పటికీ.. నెమ్మదైన కథనం, స్క్రీన్‌ప్లే ఆశించిన స్థాయిలో ఎంగేజ్ చేయలేకపోవడం వల్ల థియేటర్లలో మిశ్రమ స్పందన లభించింది. ఈ చిత్రంలో ప్రేమలు ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటించింది. ధనుష్‌తో ఆమె కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని అభిమానులు చెబుతున్నారు. అలాగే సూరజ్ వెంజరామూడు, కేఎస్ రవికుమార్, జయరామ్ కీలక పాత్రల్లో కనిపించి మెప్పించారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఇషారి కె గణేష్ నిర్మించిన ఈ సినిమాకు జి వి ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ థ్రిల్లింగ్ సన్నివేశాలకు మరింత ఉత్కంఠను తీసుకువచ్చిందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఇప్పటికే ఓటీటీలో పలువురు తమిళ చిత్రాలు మంచి ఆదరణ పొందుతున్న నేపథ్యంలో 'కర' కూడా డిజిటల్ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో ఆసక్తిగా మారింది. థియేటర్లలో నిరాశపరిచిన ఈ చిత్రం.. ఓటీటీలో కొత్త స్పందన దక్కించుకుంటుందేమో చూడాలి.

# 'స్పిరిట్'లో త్రిప్తి పాత్రపై ఆసక్తి

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ చర్చ జరుగుతుండగా.. ఇప్పుడు హీరోయిన్ త్రిప్తి దిమ్రి పాత్ర గురించి వచ్చిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. తాజాగా దర్శకుడు హేమంత్ మధుకర్ చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో వైరల్‌గా మారాయి. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో హీరోయిన్ పాత్రలు కేవలం గ్లామర్‌కే పరిమితం కావని, కథలో భావోద్వేగాలకు బలమైన ఆధారంగా నిలుస్తాయని ఆయన తెలిపారు. మహిళా పాత్రలను ఎంతో లోతుగా, బలంగా రాసే దర్శకుల్లో సందీప్ ఒకరని ప్రశంసించారు. ఈ సందర్భంగా 'అర్జున్ రెడ్డి' చిత్రంలోని ప్రీతి పాత్రను, 'యానిమల్' సినిమాలో గీతాంజలి పాత్రను ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు. ఆ పాత్రలు కథలో కీలక మలుపులు తీసుకురావడమే కాకుండా ప్రేక్షకుల హృదయాలను తాకాయని పేర్కొన్నారు. హీరోకు జోడీగా మాత్రమే కాకుండా కథను ముందుకు నడిపించే శక్తివంతమైన పాత్రలుగా అవి నిలిచాయని చెప్పారు. త్రిప్తి దిమ్రి ఎంపికపై కూడా హేమంత్ స్పందించారు. ప్రతి పాత్రకు సరిపోయే నటిని దర్శకుడు ఎంపిక చేస్తాడని, పోలికలు పెట్టడం సరైంది కాదని అన్నారు. 'స్పిరిట్' కథలో త్రిప్తి పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఆమె నటన ప్రేక్షకుల అంచనాలను మించేలా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే 'యానిమల్' సినిమాతో త్రిప్తి దిమ్రి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఇప్పుడు ప్రభాస్ సరసన నటించడం ఆమె సినీ ప్రయాణంలో కీలక మలుపుగా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక 'స్పిరిట్' సినిమా విషయానికి వస్తే.. ఇది శక్తివంతమైన యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సందీప్ రెడ్డి వంగా శైలిలో యాక్షన్, భావోద్వేగాలు, ఉత్కంఠభరిత సన్నివేశాలతో ఈ సినిమా రూపొందనుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.



# సూర్య వరుస సినిమాలతో దూకుడు

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తాజాగా విడుదలైన 'వీరభద్రుడు' చిత్రంతో మళ్లీ విజయాల బాట పట్టారు. గత కొంతకాలంగా వరుస పరాజయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయనకు ఈ సినిమా మంచి ఊరటనిచ్చిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమాలో పూర్తి స్థాయి హీరో పాత్ర కాకపోయినా.. కథకు కీలకమైన ప్రత్యేక పాత్రలో కనిపించిన సూర్య తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సినిమా విడుదలకు ముందే సూర్య పాత్రపై భారీ ఆసక్తి నెలకొంది. మొదట ఈ చిత్రం పూర్తిగా ఆయన చుట్టూనే తిరుగుతుందనే ప్రచారం జరిగినప్పటికీ.. విడుదల తర్వాత ఆయన పాత్ర పరిమితంగానే ఉన్నట్లు తేలింది. అయినప్పటికీ తెరపై కనిపించిన ప్రతి సన్నివేశంలో తన ప్రత్యేక ముద్ర వేసి అభిమానుల ప్రశంసలు అందుకున్నారు. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగ క్షణాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కూడా 'వీరభద్రుడు' మంచి వసూళ్లు సాధించడంతో ఈ విజయానికి ప్రధాన కారణంగా సూర్య పేరే వినిపిస్తోంది. అభిమానులు కూడా సామాజిక మాధ్యమాల్లో ఈ విజయాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. ఇక ఈ విజయంతో సూర్య వరుస చిత్రాలతో బిజీగా మారిపోయారు. ప్రస్తుతం ఆయన తన కెరీర్‌లో 47వ చిత్రంలో నటిస్తున్నారు. మలయాళంలో సంచలన విజయం సాధించిన 'ఆవేశం' చిత్ర దర్శకుడు జీతు మాధవన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. భారీ యాక్షన్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. అదే సమయంలో సూర్య 48వ చిత్రానికి కూడా అంగీకారం తెలిపినట్లు కోలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. 'జై భీమ్' చిత్రంతో ప్రశంసలు అందుకున్న దర్శకుడు టీజే జ్ఞానవేల్ ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వినిపించిన కథ సూర్యకు ఎంతో నచ్చడంతో వెంటనే అంగీకరించినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని సూర్య స్వంత నిర్మాణ సంస్థ 'జగరం స్టూడియోస్' నిర్మించనున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్‌లో చిత్రీకరణ ప్రారంభించి 2027 వేసవి కానుకగా విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక తెలుగు ప్రేక్షకులకు కూడా సూర్య నుంచి మరో ప్రత్యేక చిత్రం రానుంది. దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే నేరుగా తెలుగు చిత్రానికి సంబంధించిన చిత్రీకరణ ఇప్పటికే పూర్తైనట్లు సమాచారం. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాను సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా 'వీరభద్రుడు' విజయంతో తిరిగి ఫామ్‌లోకి వచ్చిన సూర్య.. విభిన్న కథలు, ప్రముఖ దర్శకులతో వరుస సినిమాలు చేస్తూ అభిమానుల్లో భారీ అంచనాలు పెంచుతున్నారు.







# ఆగస్టు 14న 'విశ్వనాథ్ అండ్ సన్స్' విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వచ్చే దీర్ఘ వీకెండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ తేదీని ఖరారు చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. 'సార్', 'లక్కీ భాస్కర్' చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరి.. ఈసారి సూర్యతో కలిసి భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో సూర్య 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ 'సంజయ్ విశ్వనాథ్' పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా కొత్త లుక్‌లో దర్శనమివ్వబోతున్నారని చిత్రబృందానికి సమీప వర్గాలు చెబుతున్నాయి. సూర్య సరసన యువ కథానాయిక మమితా బైజు నటిస్తుండగా.. సీనియర్ నటీమణులు రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్, భవాని శ్రీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ స్వరాలు సమకూరుస్తుండగా.. నిమిష్ రవి ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎడిటర్‌గా నవీన్ నూలి పనిచేస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలు, క్రీడా నేపథ్యం, యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళ ప్రేక్షకులను ఒకేసారి ఆకట్టుకునేలా ఉండబోతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com